పీలేరులో మంచు దుప్పటి



పీలేరు-మదనపల్లె మార్గంలోని ఏపీఐఐసీ లేఅవుట్‌లో మంచు దృశ్యాలు



పీలేరులో రెండు రోజులుగా మంచు కురుస్తోంది. కొంత కాలంగా వాతావరణ మార్పుల కారణంగా విపరీతమైన ఉక్కపోతకు గురై అవస్థలు పడుతున్న పీలేరు ప్రాంత ప్రజలు మంచును చూసి సంతోషం వ్యక్తం చేస్తున్నారు. వేసవిని తలపించిన ఎండలు, ఎడతెగని ఉక్కపోత, ఆపై చికాకు పెడుతున్న కరెంటు కోతల నుంచి మంచు కారణంగా ఉపశమనం లభించే అవకాశం ఉండొచ్చని వారు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. పీలేరు పట్టణంతో పాటు తిరుపతి-మదనపల్లె మార్గాన్ని గురువారం ఉదయం 8 గంటల వరకు మంచు కమ్మేసింది.

- పీలేరు (ఆంధ్రజ్యోతి)

డీఎస్సీలో అక్కాచెల్లెళ్ల ప్రతిభ

● ఒకే పాఠశాలలో టీచర్ ఉద్యోగాలు



అక్కాచెల్లెళ్లను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

మదనపల్లె అర్బన్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం నిర్వహించిన డీఎస్సీలో ములకలచెరువు మండల బత్తలాపురానికి చెందిన చంద్రమోహన్ సత్యవతి దంపతుల కుమార్తెలు జల్లా శ్రీలత, జల్లా హేమలత ప్రతిభ కనబరచి ఉపాధ్యాయ ఉద్యోగాలు సాధించారు. ఇద్దరూ ఉద్యోగం సాధించడంతో పాటు ఒకే పాఠశాలలో ఎస్జీటీలుగా పోస్టింగ్ సాధించడం విశేషం. ఇద్దరూ మదనపల్లె మున్సిపాలిటీలోని హోమ్ మున్సిపల్ హైస్కూల్‌లో ఎస్జీటీలుగా సోమవారం ఉపాధ్యాయులుగా చేరారు. ఈ సందర్భంగా సోమవారం పాఠశాలలో వారిని ఉపాధ్యాయులు అభినందించారు. కార్యక్రమంలో యూటీఎఫ్ నాయకులు సుధాకర్, బెల్లం సుధాకర్, జయరాం, భార్గవి, శోభారాణి, తదితరులు పాల్గొన్నారు.

అర్జీలను త్వరగా పరిష్కరించాలి : కలెక్టర్

రాయచోటి (నేతాజీ సర్కిల్), అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కార వేదిక సమస్యలు త్వరితగతిన పరిష్కరించాలని కలెక్టర్ నిశాంత్‌కుమార్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని పీజీఆర్‌ఎస్ హాలులో కలెక్టర్ అధ్యక్షతన పీజీఆర్‌ఎస్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి అర్జీకి నిర్ణీత సమయంలో పరిష్కార మార్గం చూపేలా అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. వీరబల్లి మండలం వంగిమళ్ల గ్రామం నాగిరెడ్డిగారిపల్లెకు చెందిన ఎం.గిరీశ్‌కుమార్ తాను వికలత్వంతో బాధపడుతున్నానని నడవలేని పరిస్థితుల్లో ఉన్నానని ప్రభుత్వం ద్వారా వీల్‌చైర్ బండిని ఇప్పించాలని కలెక్టర్‌కు విన్నవించారు. సంబేపల్లె మండలం శెట్టిపల్లె గ్రామం పంచాయతీ పరిధిలోని నూతన గడ్డపల్లెకు చెందిన మంగి పాపులమ్మ తన భర్త మరణించాడని, తనకు వితంతు పింఛన్ ఇప్పించాలని కలెక్టర్‌కు విన్నవించుకుంది. కార్యక్రమంలో డీఆర్‌వో మధుసూదన్‌రావు, ఆర్డీవో శ్రీనివాస్, ఏడీ సర్వే భరత్‌కుమార్ అర్జీలు స్వీకరించారు.

శ్రీశైలం దేవస్థానం చైర్మన్‌గా పోతుగుంట ప్రమాణ స్వీకారం

● రాజంపేట నుంచి పెద్దఎత్తున తరలివెళ్లిన సన్నిహితులు



ప్రమాణ స్వీకారం చేస్తున్న పోతుగుంట రమేశ్‌నాయుడు

రాజంపేట, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి) : శ్రీశైలం దేవస్థానం పాలకమండలి చైర్మన్‌గా రాజంపేటకు చెందిన పోతుగుంట రమేశ్‌నాయుడు సోమవారం ప్రమాణ స్వీకారం చేశారు. కార్యక్రమానికి రాజంపేట నుంచి బీజేపీ నేతలు వారి సన్నిహితులు, పలువురు పార్టీ నేతలు తరలివెళ్లారు. మంత్రి సత్యకుమార్, మాతంగి పీఠాధిపతి రవీంద్రస్వామి, 20 సూత్రాల అమలు కమిటీ చైర్మన్ లంకా దినకర్‌లతో పాటు ఆదోని ఎమ్మెల్యే పార్థసారధి, బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దయాకర్‌రెడ్డి, తదితర నేతలు హాజరయ్యారు. ఆలయ ఈవో శ్రీనివాసరావు ఆధ్వర్యంలో జరిగిన ఈ ప్రమాణ స్వీకారంలో పెద్దఎత్తున భక్తులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రమేశ్‌నాయుడు ఆంధ్రజ్యోతితో మాట్లాడుతూ తాను శ్రీశైలం దేవస్థానం పవిత్రతకు, అభివృద్ధికి, ఆధ్యాత్మికతకు నిరంతరం పాటుపడతానన్నారు. ఈనెల 16న ప్రధాని నరేంద్రమోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడులతో పాటు అనేకమంది నేతలు శ్రీశైలానికి తన హయాంలో రావడం అదృష్టంగా భావిస్తున్నానన్నారు. దేశంలోనే ఈ క్షేత్రం పెద్ద ఎత్తున అభివృద్ధి చెందుతుందని తెలిపారు.

ప్రకృతి రైతు శ్రీదేవికి జాతీయస్థాయి గౌరవం

● అవార్డు ప్రదానం చేసిన ప్రధాని మోదీ



ప్రధానమంత్రి నరేంద్రమోదీ నుంచి అవార్డు అందుకుంటున్న రైతు సూరం శ్రీదేవి

రామాపురం, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నల్లగుట్టపల్లె పంచాయతీ కొత్తపల్లెకు చెందిన మహిళా రైతు సూరం శ్రీదేవి శనివారం ఢిల్లీలో జరిగిన కార్యక్రమంలో ప్రధానమంత్రి నరేంద్రమోదీ చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు. వ్యవసాయ రంగంలో విశిష్ట సేవలు అందించిన రైతులు, స్వయం సహాయక సంఘాల సభ్యులకు అవార్డులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా రాష్ట్రం నుంచి మహిళా రైతు సూరం శ్రీదేవి ప్రకృతి వ్యవసాయంలో సాధించిన విశేష విజయాలకు గుర్తింపుగా జాతీయ పురస్కారం లభించింది. ఆమె పర్యావరణ అనుకూలమైన సాగు విధానాలపై గ్రామీణ మహిళలకు శిక్షణ ఇవ్వడం ద్వారా సుస్థిర వ్యవసాయాన్ని ప్రోత్సహిస్తున్నారు. ప్రధాని నరేంద్రమోదీ శ్రీదేవి కృషిని ప్రశంసిస్తూ ఆమె సేవలు భారత గ్రామీణ మహిళల శక్తి, సహనానికి ప్రతీక అని పేర్కొన్నారు. ప్రకృతి వ్యవసాయ జిల్లా ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీనివాస్‌కుమార్, జిల్లా అధ్యక్షుడు వెంకటమోహన్, పలువురు అధికారులు శ్రీదేవిని అభినందిస్తూ ఆమె గౌరవం రాష్ట్రానికి మరింత ప్రతిష్ఠ తీసుకువచ్చిందని పేర్కొన్నారు. రామాపురం ఆర్బీకేలో సోమవారం జరిగిన అభినందన సభలో మార్కెట్ కమిటీ చైర్మన్ షఫీనాయక్, మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ రమేశ్‌రెడ్డి శ్రీదేవిని సన్మానించారు. కార్యక్రమంలో పలువురు నాయకులు, మండల వ్యవసాయాధికారిణి వై.నాగమణి, ప్రకృతి వ్యవసాయ మండల మాస్టర్ ట్రైనర్ మధుకర్, మోడల్ మేకర్ సదాశివరెడ్డి, సూరం వెంకట్రామిరెడ్డి, సుధాకర్, కదిరు న్నిషా, రైతులు, సిబ్బంది పాల్గొన్నారు.

ధర్నా చేస్తే.. టమోటాలు కొనాలా...?!

- తగ్గేదేలేదంటూ అధికారులకు వ్యాపారుల హెచ్చరికలు
- కడప-బెంగళూరు జాతీయ రహదారిపై రైతుల ధర్నా
- స్తంభించిన ట్రాఫిక్
- బారులు తీరిన వాహనాలు
- మార్కెట్ యార్డు వద్ద ఉద్రిక్తత
- పోలీస్, రెవెన్యూ అధికారుల జోక్యంతో ధర్నా విరమణ





జాతీయ రహదారిపై ధర్నా చేస్తున్న రైతులు, (ఇన్‌సెట్లో) పోలీసులతో వాదిస్తున్న రైతులు

గుర్రంకొండ, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): గుర్రంకొండ టమోటా మార్కెట్‌యార్డు వద్ద సోమవారం జాక్‌పాట్ విధానాన్ని రద్దు చేయాలంటూ వందలాది మంది రైతులు వ్యాపారుల తీరును నిరసిస్తూ కడప-బెంగుళూరు జాతీయ రహదారిపై ధర్నా, రాస్తారోకో నిర్వహించారు. సుమారు రెండు గంటలకు పైగా ధర్నా చేయడంతో వాహనాలు బారులు తీరి ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలిగింది. రైతులు ధర్నా చేస్తున్నట్లు తెలియడంతో వాల్మీకిపురం ఎస్‌ఐ చంద్రశేఖర్ రైతుల వద్దకు చేరుకొని మార్కెట్‌లో జరుగుతున్న అక్రమాలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ మార్కెట్ యార్డులో జాక్‌పాట్ విధానంతో వ్యాపారులు దోచుకొంటున్నారని, అధికారులకు పలుమార్లు చెప్పినా పట్టించుకోవడం లేదని చెప్పారు. జాక్‌పాట్ విధానాన్ని ప్రశ్నించే రైతుల పట్ల వ్యాపారులు దురుసుగా ప్రవర్తిస్తున్నారని ఎస్‌ఐకు తెలిపారు. దీంతో రైతులు టమోటాకు ధరలున్న సమయంలో లక్షలాది రూపాయలు నష్టపోతునట్లు వివరించారు. అలాగే టమోటా పంటకు ధరలు లేని సమయంలో జాక్‌పాట్‌తో పెట్టుబడులు కూడా రాక రైతన్నలు అప్పుల పాలవుతున్నట్లు చెప్పారు. మార్కెట్‌యార్డులో జాక్‌పాట్ విధానాన్ని పూర్తి స్థాయిలో రద్దు చేయాలని, అప్పటి వరకు ధర్నాను విరమించేది లేదని వందలాది మంది రైతులు జాతీయ రహదారిపై కూర్చోని ధర్నా నిర్వహించారు.

ధర్నా చేస్తే కొనాలా..?

జాక్‌పాట్ విధానానికి వ్యతిరేకంగా రైతులు ధర్నా చేస్తే వ్యాపారులు టమోటాలు కొనాలా...అంటూ వ్యాపారులు అధికారులను హెచ్చరించారు. రైతులు ధర్నా చేస్తున్న సమయంలో మార్కెట్‌శాఖ కార్యదర్శి కుమార్‌రెడ్డి, వైస్ ఛైర్మన్ నౌషాద్ అలీలు వ్యాపారులతో మాట్లాడేందుకు వెళ్లారు. వ్యాపారులు జాక్‌పాట్ విధానాన్ని మానుకోవాలని అధికారులు సూచించడంతో రైతులు ధర్నా చేస్తే మండీల్లో టమోటాలు ఎలా కొంటామని...? రైతులు టమోటాలు ఎక్కడ అమ్ముకొంటారో చూస్తామంటూ అధికారులకు సవాల్ విసిరారు. దీంతో ఆగ్రహించిన రైతులు అధికారులు, కమిటీ సభ్యులను నిలదీశారు. మార్కెట్ యార్డు వ్యాపారుల సొంత జాగీరా...? అధికారుల నిర్లక్ష్యంతోనే వ్యాపారులు రెచ్చిపోతున్నారని... రైతులకు అన్యాయం చేసే వ్యాపారుల లైసెన్సులు రద్దు చేయాలంటూ నిలదీశారు. అనంతరం తహశీల్దార్ లక్ష్మీప్రసన్న, ఎస్‌ఐ చంద్రశేఖర్, కార్యదర్శి రైతులకు సర్దిచెప్పి సమస్యను పరిష్కరిస్తామని చెప్పడంతో శాంతించారు.

మార్కెట్ యార్డు వద్ద ఉద్రిక్తత

మార్కెట్ యార్డు వద్ద వందలాది మంది రైతులు జాతీయ రహదారిపై ధర్నా చేయడంతో కొంత సమయం ఉద్రిక్తత వాతావరణం నెలకొంది. రైతుల సమస్యలను పట్టించుకోవడం లేదని అధికారులు, పాలకవర్గ సభ్యులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. దీంతో రైతులకు పోలీసులకు మధ్య వాగ్వాదం చోటు చేసుకొంది. దీంతో కొంత సమయం ఉద్రిక్తత వాతావరణం నెలకొంది.

నిందితుడికి 20 ఏళ్ల జైలుశిక్ష

- చిత్తూరు పోక్సో కోర్టులో తీర్పు



నిందితుడు ప్రసాద్ (ఫైల్ ఫొటో)

మదనపల్లెఅర్బన్, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): చిన్నారి విషయంలో నిందితుడికి 20 ఏళ్ల జైలుశిక్ష అమలు చేసినట్లు చిత్తూరు పోక్సో కోర్టు సోమవారం తీర్పు ఇచ్చింది. వివరాల్లోకెళ్తే.. మదనపల్లెలో చిన్నారిపై 2021 మార్చి 3న బసినికొండ గ్రామానికి చెందిన పి.ప్రసాద్ (23)అనే యువకుడు ఓ బాలికకు మాయమాటలు చెప్పి కిడ్నాప్ చేసి అత్యాచారం చేశాడు. బాధితురాలు తల్లి మార్చి 5న మదనపల్లె తాలుకా పోలీసుస్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేసింది. అప్పట్లో కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు. నిందితుడు ప్రసాద్ చేసిన నేరం రుజువు కావడంతో చిత్తూరు జిల్లా పోక్సో కోర్టు తీర్పు ఇచ్చింది. 20 ఏళ్ల జైలుశిక్షతో పాటు రూ.8వేలు జరిమానా విధించింది. తీర్పు వెలువడగానే బాధితురాలి కుటుంబసభ్యులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కేసులో విచారాణాధికారి రవిమనోహరాచారి, అప్పటి మదనపల్లె డీఎస్పీ కేసు నమోదు చేసిన అధికారి ఎస్‌ఐ దిలీప్‌కుమార్, ప్రస్తుత మదనపల్లె డీఎస్పీ మహేంద్ర, తాలుకా సీఐ కళా వెంకటరమణ, కోర్టు కానిస్టేబుల్ వెంకటరమణ, తదితరులు పాల్గొన్నారు.

బాలికలను వివక్షతతో చూడకూడదు

- జిల్లా విస్తృత ఆరోగ్య విద్యాధికారి దేవశిరోమణి

రాయచోటిటౌన్, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): బాలికలను వివక్షతతో చూడకూడదని మగ పిల్లలతో సమానంగా చూసుకోవాలని జిల్లా విస్తృత ఆరోగ్య విద్యాధికారి (డెమో) దేవశిరోమణి పేర్కొన్నారు. అంతర్జాతీయ బాలికల దినోత్సవం సందర్భంగా సోమవారం రాయచోటి మండల పరిధిలోని కస్తూర్బాగాంధీ బాలికల పాఠశాలలో వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో బాలికలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ సమాజంలో ఆడపిల్లలపై ఉన్న అసమానత్వం, చిన్నచూపు, లింగ వివక్షత సమూల నిర్మూలనకు ప్రతిఒక్కరూ కృషి చేయాలన్నారు. అనంతరం డిప్యూటీ హెచ్‌ఈవో కె.బలరామరాజు మాట్లాడుతూ సమాజంలో ఆడ, మగ ఇరువురు సమానమేనని, లింగ నిర్ధారణ చేసినట్లు తెలిస్తే చట్టరీత్యా కఠిన శిక్షలు, జరిమానా విధించబడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో గర్ల్‌ఛైల్డ్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ సుమతి, జిల్లా చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్ వినోద్, హెచ్‌ఈ రాజగోపాల్, సీహెచ్‌వో రామకృష్ణ యాదవ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

తైక్వాండో పోటీల్లో బంగారు పతకం



రైల్వేకోడూరు, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్థాయి తైక్వాండో పోటీలు బాపట్ల జిల్లాలోని పేటూరులో 69వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 10, 11, 12 తేదీల్లో నిర్వహించారు. ఈ పోటీల్లో రైల్వేకోడూరుకు చెందిన విద్యార్థిని టి.సోహిత అండర్-14, 38 ప్లస్ విభాగంలో తన ప్రతిభను ప్రదర్శించి బంగారు పతకాన్ని సాధించినట్లు ఎస్కే స్పోర్ట్స్ అకాడమి కోచ్ ఎస్కే మౌలా సోమవారం తెలిపారు. నవంబర్ నెలలో నిర్వహించే జాతీయ స్థాయి పోటీలకు సోహిత ఎంపిక అయినట్లు తెలిపారు.

ప్రేమ వేధింపులతో బాలిక మృతి

- పూలికుంటలో దారుణం

గాలివీడు, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): మండలంలోని పూలికుంట పంచాయతీ గుంటికాడపల్లికు చెందిన బాలిక (14) ప్రేమ వేధింపులతో ఆత్మహత్య చేసుకున్న దారుణ సంఘటన చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. అదే గ్రామానికి చెందిన ఓ వ్యక్తి తరచూ 'నేను నిన్ను ప్రేమిస్తున్నాను.. నాతో మాట్లాడాలి' అంటూ వేధింపులకు గురి చేసేవాడు. దీంతో మనస్థాపానికి గురైన బాలిక అక్టోబరు 9న తమ పొలం కోసం ఉంచిన గడ్డి మందును సేవించింది. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఆమె ఆరోగ్యం విషమించడంతో అక్టోబరు 13వ తేదీ తిరుపతి స్విమ్స్ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ అర్థరాత్రి మృతి చెందింది. ఈ ఘటనపై గాలివీడు పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్‌ఐ రామకృష్ణ తెలిపారు.

ఎంపీపీ రాజీనామా



సీఈవోకు రాజీనామా పత్రం అందజేస్తున్న ఎంపీపీ అనసూయమ్మ

తంబళ్లపల్లె, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): తంబళ్లపల్లె ఎంపీపీ అనసూయ నారాయణరెడ్డి సోమవారం తన పదవికి రాజీనామా చేశారు. వైసీపీ నాయకులతో కలిసి చిత్తూరులోని జడ్పీ సీఈవో రవికుమార్ నాయుడుకు తన రాజీనామా పత్రాన్ని సమర్పించారు. ఆమె మాట్లాడుతూ..విదేశాల్లో ఉన్న తమ పిల్లలను చూసేందుకు భర్త నారాయణరెడ్డితో కలిసి వెళ్తున్నామని సుమారు ఆరు, ఏడు నెలలు అక్కడే ఉంటామన్నారు. ఈ సమయంలో అభివృద్ధికి ఆటంకం కలుగకుండా వేరొకరిని నియమించాలని సీఈవోను కోరుతూ.. తన పదవికి రాజీనామా చేసినట్లు తెలిపారు.

బైక్ ప్రమాదంలో యువకుడు మృతి



మృతిచెందిన యువకుడు (ఫైల్)

మదనపల్లెఅర్బన్, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): బైక్ నడుపుతూ కింద పడిన ప్రమాదంలో యువకుడు మృతిచెందిన సంఘటన మదనపల్లె పట్టణంలో చోటు చేసుకుంది. సోమవారం మదనపల్లె పట్టణం, అమ్మచెరువు మిట్టకు చెందిన పవన్‌కుమార్, పల్లవి దంపతుల నీరుగట్టువారిపల్లెలోని మాయాబజార్‌లో సెల్‌షాపు నిర్వహిస్తున్నారు. వారి కుమారుడు అజయ్‌దేవా(19) ఫిప్లికాట్ పనులు చేస్తారు. ఇందులో భాగంగా మదనపల్లె టౌన్ నుంచి వెళుతుండగా అమ్మచెరువుమిట్ట వద్ద బైక్ స్కిడ్ అయి ప్రమాదం జరిగింది. ఇందులో యువకుడు అక్కడికక్కడే మృతి చెందాడు.

వృద్ధుడికి పాముకాటు



పాముకాటుతో చికిత్స పొందుతున్న వృద్ధుడు

మదనపల్లెఅర్బన్, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): పాముకాటుకు వృద్ధుడు గురైన సంఘటన నిమ్మనపల్లె మండలంలో చోటు చేసుకుంది. సోమవారం సాయంత్రం నిమ్మనపల్లె మండలం, గారబురుజు గొల్లపల్లెకు చెందిన వెంకటప్ప కుమారుడు గుర్రప్ప (50) మేకలను మేపుతుండగా పాముకాటుకు గురయ్యాడు. గమనించిన కుటుంబసభ్యులు వెంటనే మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి చికిత్సను అందించారు. ఈ మేరకు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ కోలుకొంటున్నాడు.

ఆర్టీసీ డ్రైవర్ నిర్వాకంతో ..

మహిళకు విరిగిన కాలు

ఓబులవారిపల్లె, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చిన్నఓరంపాడు క్రాస్ వద్ద ఆర్టీసీ బస్సు ఎక్కే క్రమంలో పొరపాటున మహిళ కింద పడి కాలుకు తీవ్ర గాయమై.. ఆసుపత్రిపాలైందని బాధితురాలి కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. చిన్నఓరంపాడు గ్రామ పంచాయతీ కమ్మపల్లె హరిజనాడ గ్రామానికి చెందిన దాసరి అచ్చమ్మ గ్రామంలోని మరికొందరితో కలిసి రైల్వేకోడూరుకు వెళ్లే క్రమంలో బస్సు కోసం వేచి ఉండగా ఏపీ39యూజీ 8251 నంబరు గల బస్సు రావడం జరిగింది. అయితే బస్సులో ప్రయాణికులు ఎక్కువగా ఉండడంతో డ్రైవర్ స్టాప్‌లో కాకుండా మరికొంత దూరంలో నిలపడం జరిగింది. బస్సు వద్దకు వెళ్లిన అచ్చమ్మ బస్సు మెట్లు ఎక్కగా ఆమెతోపాటు వచ్చినవారు ఎక్కకపోవడంతో తిరిగి దిగే క్రమంలో బస్సు ముందుకు కదలడంతో దీంతో ఆమె కిందపడి ఎడమకాలు తీవ్ర గాయాలపాలైంది. ఇది గమనించిన ప్రయాణికులు కదులుతున్న బస్సును ఆపి డ్రైవర్, కండక్టర్‌లను మందలించడం జరిగింది. గాయపడిన బాధితురాలిని 108 ద్వారా రాజంపేట ప్రభుత్వాసుపత్రికి తరలించగా మెరుగైన వైద్యం కోసం వెళ్లాలని సూచించడంతో రైల్వేకోడూరులో ప్రైవేటు ఆసుపత్రిలో వైద్యం పొందుతుందని తమకు న్యాయం చేయాలని పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయడం జరిగింది. ప్రభుత్వం మహిళలకు స్త్రీ శక్తి పథకంద్వారా ఉచిత బస్సు పెట్టినప్పటి నుంచి బస్సు డ్రైవర్లు, కండక్టర్ల తీరు తీవ్ర అభ్యంతకరంగా ఉందని పలువురు ఆవేదన వ్యక్తం చేశారు.

ఎగువ చెన్నామర్రి సమీపంలో చిరుత

- కుక్కను చంపి...

కురబలకోట, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎర్రబల్లి పంచాయతీ ఎగువ చెన్నామర్రి గ్రామ సమీపంలో చిరుత సంచారం కలకలం రేపింది. ప్రముఖ పర్యాటక కేంద్రం హార్సిలీహిల్స్ అటవీ ప్రాంతంలో చిరుత సంచరిస్తున్నట్లు పలుమార్లు సంఘటనలు వెలుగు చూశాయి. కాగా హార్సిలీహిల్స్ అటవీ ప్రాంతం సమీపంలో రైతు నారాయణరెడ్డి తన పొలంలో ఆదివారం రాత్రి కుక్కను కాపలాగా పెట్టి ఇంటికి వచ్చేశాడు. సోమవారం ఉదయం పొలానికి వెళ్లిన రైతు కుక్క కళేబరాన్ని చూసి చుట్టుపక్కల ఉన్న రైతులను పిలిచాడు. చిరుత దాడిలోనే కుక్క చనిపోయిందని, అక్కడ చిరుత పాదముద్రలు ఉన్నాయని రైతులు తెలిపారు. వెంటనే వారు అటవీ శాఖాధికారులకు సమాచారం ఇచ్చారు. కొద్దిరోజుల క్రితం ఇదే ప్రాంతంలో రైతు రెడ్డిశేఖర్‌రెడ్డికి చెందిన కుక్కను కూడా చిరుత లాక్కెళ్లిన ఘటన జరిగింది. ఈ ప్రాంతంలో చిరుత సంచారంతో ప్రజలు భయాందోళన చెందుతున్నారు.

సైనిక్ స్కూల్ ప్రవేశాలకు నోటిఫికేషన్ జారీ

- దరఖాస్తులకు ఈ నెల 30 చివరి తేది



కలికిరి సైనిక్ స్కూల్

కలికిరి, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): కలికిరి సైనిక్ స్కూల్‌లో 2026-27 విద్యా సంవత్సరానికి ప్రవేశాల కోసం జాతీయ స్థాయిలో నిర్వహించే అర్హత పరీక్షకు దరఖాస్తులు పంపుకోవడానికి నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ నోటిఫికేషన్ జారీ చేసింది. కలికిరితో పాటు విజయనగరం జిల్లా కోరుకొండ సైనిక్ స్కూల్ ప్రవేశాలకు కూడా దరఖాస్తులు పంపుకోవచ్చు. ఇవి రెండూ కాకుండా ఆదానీ వరల్డ్ స్కూల్ (నెల్లూరు), నేతాజీ సైనిక్ స్కూల్ (కృష్ణా), వెరిటాస్ సైనిక్ స్కూల్ (తిరుపతి) ఈ మూడు ప్రైవేట్ (అప్రూవ్) సైనిక్ స్కూళ్లలో ప్రవేశాలకు కూడా అవకాశం కల్పించారు. ఆరు, తొమ్మిది తరగతుల్లో మాత్రమే కొత్తగా ప్రవేశాలుంటాయి. ఈ నెల 30వ తేదీ లోగా దరఖాస్తులు పంపుకోవాల్సి వుంటుంది. జనవరిలో ఎన్టీఏ ఆధ్వర్యంలో ప్రవేశ పరీక్షలు నిర్వహిస్తారు. కేంద్రాలు, పాఠశాల వారీగా అందుబాటులో వున్న సీట్ల వివరాలను ఎన్టీఏ నోటిఫై చేసింది. సాధారణంగా అక్టోబరులో దరఖాస్తులను ఆహ్వానించడం, జనవరిలో అర్హత పరీక్షలు నిర్వహణ, అనంతరం మార్చి, ఏప్రిల్ నెలల్లో ఇంటర్వ్యూలు లాంటి ఆనవాయితీలుండగా గతేడాది రెండు నెలలు ఆలస్యంగా ప్రక్రియ కొనసాగింది. అయితే ఈ ఏడాది తిరిగీ ఆనవాయితీ ప్రకారమే షెడ్యూలు ప్రకటించారు. ఈ నెల 30న ఆన్‌లైన్‌లో దరఖాస్తులు సమర్పించిన అనంతరం అందులో ఏవైనా మార్పులు, చేర్పులుంటే సరిదిద్దుకోవడానికి 31న అవకాశం కల్పించారు. ఆ తరువాత వెబ్‌సైట్‌లో హాల్‌టికెట్లు జారీ చేస్తారు. వివరాలేవైనా అవసరమైతే పనివేళల్లో సంప్రదించడానికి ఎన్టీఏ హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేసింది. 011-40759000, 011-69227700 నంబర్లను సంప్రదించవచ్చు.

అర్హతలు

ఆరవ తరగతి ప్రవేశాలకు 2026 మార్చి 31 నాటికి 10 నుంచి 12 ఏళ్ల వయసుండాలి. అంటే 2014 ఏప్రిల్ 1 నుంచి 2016 మార్చి 31 మధ్య జన్మించి వుండాలి. తొమ్మిదవ తరగతి ప్రవేశాలకు 13-15 ఏళ్ల మధ్య వయసుండాలి. అంటే 201 ఏప్రిల్ 1 నుంచి 2013 మార్చి 31 మధ్య జన్మించి వుండాలి. దరఖాస్తు రుసుం జనరల్, డిఫెన్స్ కేటగిరీ విద్యార్థులకు రూ.850, ఎస్సీ, ఎస్టీలకు రూ.700 వంతున చెల్లించాలి. ఆరవ తరగతికి మధ్యాహ్నం 2 నుంచి 4.30 గంటల వరకు, తొమ్మిదవ తరగతికి 5 గంటల వరకు పరీక్షలు నిర్వహిస్తారు.

అందుబాటులో వుండే సీట్లు

కలికిరి సైనిక్ స్కూల్‌లో ఆరవ తరగతిలో మొత్తం 105 సీట్లున్నాయి. అందులో స్థానికత కింద (ఏపీ విద్యార్థులకు) బాలురుకు 66, బాలికలకు ఐదు సీట్లు, మిగిలినవి ఇతర రాష్ట్రాల వారికి కేటాయించారు. కోరుకొండలో మొత్తం 90 సీట్లుండగా స్థానికత కింద 60, ఇతరులకు 30 సీట్లు కేటాయించారు. తొమ్మిదవ తరగతిలో కలికిరిలో 10 సీట్లుండగా అందులో రెండు మాత్రం ఇతర రాష్ట్రాలకు కేటాయించారు. కోరుకొండలో 23 సీట్లుండగా అందులో 7 సీట్లు ఇతర రాష్ట్రాలకు కేటాయించారు. ఇక ప్రైవేట్ అప్రూవ్ స్కూళ్లలో ఆదాని వరల్డ్ స్కూల్‌లో మొత్తం 80 సీట్లు, నేతాజీలో బాలురుకు మాత్రమే 120 సీట్లున్నాయి. ఇక తిరుపతి వెరిటాస్‌లో 150 సీట్లుండగా ఆదానిలో మాత్రమే 9వ తరగతిలో 30 సీట్లున్నాయి.

అర్జీలు పరిష్కరించడమే మా పనా...!

- ఎన్నిసార్లు తిరుగుతావంటూ అర్జీదారుడిపై డీటీ ఆగ్రహం



సబ్ కలెక్టరేట్ పీజీఆర్ఎస్ హాల్లో అర్జీదారుడు అజీజ్‌తో మాట్లాడుతున్న డీటీ శాంతమ్మ

మదనపల్లె టౌన్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం పీజీఆర్ఎస్ కార్యక్రమాన్ని ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తోంది. పీజీఆర్ఎస్‌లో ప్రజల నుంచి వచ్చే అర్జీలకు ప్రాధాన్యత ఇచ్చి పరిష్కారం చూపాలని స్వయంగా సీఎం చంద్రబాబు కలెక్టర్లను ఆదేశించిన విషయం తెలిసిందే. కానీ మదనపల్లె సబ్‌కలెక్టరేట్‌లో మాత్రం ఓ డీటీ అర్జీదారుడిపై అందరి ముందే ఆగ్రహం వ్యక్తం చేసింది. అర్జీలు పరిష్కరించడమే మా పనా..? ఎన్నిసార్లు తిరుగుతావంటూ పీజీఆర్ఎస్ హాల్లోనే అందరి ముందు అర్జీదారున్ని నిలదీసింది. వివరాల్లో వెళితే.. సోమవారం మదనపల్లె సబ్‌కలెక్టరేట్‌లో డీఏవో నిర్మలదేవి ఆధ్వర్యంలో పీజీఆర్ఎస్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా చిత్తూరు జిల్లా వి.కోట మండలం తోటకనుమకు చెందిన అజీజ్‌సాహెబ్ మాట్లాడుతూ కుప్పం బ్రాంచ్ కెనాల్ కోసం తమ భూమిని తీసుకున్న ప్రభుత్వం ఇంత వరకు నష్టపరిహారం ఇవ్వలేదన్నారు. దీనిపై మూడు నెలల నుంచి తిరుగుతున్నా తమ ఫైలు కదలలేదని ఫిర్యాదు చేశారు. దీనిపై హెచ్ఎన్ఎస్ఎస్ డీటీ శాంతమ్మ వచ్చి మాట్లాడుతూ తమకు పనిభారం ఎక్కువగా ఉందని, అర్జీలు చూడటమే తమ పనా అంటూ, ఎన్నిసార్లు తిరుగుతావంటూ అర్జీదారున్ని ప్రశ్నించింది. దీంతో అవాక్కయిన అర్జీదారుడు మీడియాతో తనగోడు వెళ్లబోసుకున్నాడు. ఈ విషయమై డీఏవో నిర్మలదేవి మాట్లాడుతూ అర్జీదారులతో మర్యాదపూర్వకంగా మాట్లాడాలని, అజీజ్ ఫైలు తొందరగా పూర్తి చేసి ఇవ్వాలని డీటీ శాంతమ్మకు సూచించారు. కురబలకోట మండలానికి చెందిన పగడాల గోపాలకృష్ణ భూమికి సంబంధించి మ్యుటేషన్ చేయడానికి సబ్‌కలెక్టరేట్‌లోని ఓ క్లర్కు తిప్పుకుంటూనే ఉన్నాడని బాధితుడు డీఏవోకు ఫిర్యాదు చేశాడు. చేనేత కార్మికులకు ప్రభుత్వం మంజూరు చేసిన ఉచిత విద్యుత్ పథకాన్ని ఇంత వరకు అమలు చేయలేదని చేనేత కార్మికులు అర్జీ అందజేశారు. మదనపల్లె ఎంపీడీవో వైసీపీ సర్పంచ్‌లను వేధిస్తున్నాడని వైసీపీ నాయకులు డీఏవోకు ఫిర్యాదు చేశారు. వీటితో పాటు 52 మంది వివిధ సమస్యలతో డీఏవోకు అర్జీలు అందజేశారు.

అలసత్వం చేయొద్దు

- అదనపు ఎస్పీ వెంకటాద్రి



ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న అదనపు ఎస్పీ వెంకటాద్రి

రాయచోటిటౌన్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): ప్రజల సమస్యలను తక్షణమే పరిష్కరించడం లో అధికారులు ఏమాత్రం అలసత్వం చేయొద్దని, చట్ట పరిధిలో బాధితులకు సత్వర న్యాయం అందించాలని అదనపు ఎస్పీ ఎం.వెంకటాద్రి జిల్లాలోని పోలీసు అధికారులను ఆదేశించారు. ఎస్పీ ధీరజ్ కునుబిల్లి ఆదేశాల మేరకు సోమవారం జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి నలుమూలల నుంచి వచ్చిన ఫిర్యాదుదారులతో అదనపు ఎస్పీ నేరుగా మాట్లాడి వారి సమస్యలను శ్రద్ధగా తిలకించి అర్జీలను క్షుణ్ణంగా పరిశీలించారు. సదరు అర్జీలపై సంబంధిత పోలీసు అధికారులతో ఫోన్‌లో మాట్లాడి తక్షణమే విచారణ జరిపి చట్టపరిధిలో సత్వర న్యాయం అందించాలని ఆదేశించారు. అలాగే తీసుకున్న చర్యలకు సంబంధించిన నివేదికలను వెంటనే జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయానికి పంపాలని అధికారులను ఆదేశించారు. అంతేగాక దివ్యాంగులు, వృద్ధులు, మహిళల ఫిర్యాదులకు మొదట ప్రాధాన్యత ఇచ్చి వేగంగా సమగ్ర విచారణ జరిపి సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. జిల్లా కేంద్రానికి రాలేని బాధితులు వారి దగ్గరలోని పోలీసుస్టేషన్లు, సర్కిల్ కార్యాలయాలు, సబ్ డివిజన్ కార్యాలయాల్లో కూడా ఫిర్యాదు చేయవచ్చని సూచించారు.

విద్యార్థి మృతదేహం లభ్యం

మదనపల్లెఅర్బన్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని వడ్డిపల్లె సమీపంలో గల హంద్రీనీవా కాలువలో ఆదివారం గల్లంతైన విద్యార్థి సాయికిరణ్ మృతదేహాన్ని సోమవారం ఫైర్ సిబ్బంది బయటకు తీశారు. మృతుడి తల్లిదండ్రులు సురేశ్, సరళలు మాట్లాడుతూ ఆదివారం కూడా క్లాసులు నడపడంతోనే తమ అబ్బాయి మృత్యువాత పడ్డారని ఆరోపించారు. వెంటనే మదనపల్లె వన్‌టౌన్ పోలీసులు సంఘటన స్థలంలోకి వెళ్లి మృతదేహాన్ని పరిశీలించి మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి మార్చురీకి తరలించారు. ఈ మేరకు సీఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.



హంద్రీనీవా కాలువలో పడి మృతి చెందిన విద్యార్థి సాయికిరణ్

శ్రమదాన స్ఫూర్తి.. సిమెంటు రోడ్డు పూర్తి

- నిన్నటివరకు మోకాళ్లలోతు నీరు
- నేడు సిమెంటు రోడ్డుతో సమస్య పరిష్కారం
- మందరం రాచపల్లెలో స్వయంగా రోడ్డు వేసుకున్న గ్రామస్థులు

రాజంపేట, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): అనేక అభివృద్ధి కార్యక్రమాల్లో ఆదర్శంగా ఉండే మందరం రాచపల్లె గ్రామస్థులు స్వయంగా శ్రమదానం చేసి సిమెంటు రోడ్డు వేసుకుని ఇతరులకు ఆదర్శప్రాయంగా నిలిచారు. రాజంపేట-చిట్వేలి రోడ్డు మార్గంలో ప్రధాన రహదారి పక్కన మందరం పల్లె రాచపల్లె గ్రామం ఉంది. ఆ గ్రామంలో సుమారు 70 గృహాలు ఉన్నాయి. అయితే గత పదేళ్లగా గ్రామంలో మురికినీటి సమస్య ఇబ్బందికరం చేస్తోంది. గ్రామంలో గతంలో సిమెంటు రోడ్డు వేసుకున్నా రోడ్డు గుంతలుగా మారడంతో వర్షపు నీరంతా గ్రామ రహదారిలో చేరి మురికి మయంగా మారింది. అటు పోవాలన్నా ఇటు రావాలన్నా గ్రామవీధిలో నిలబడ్డ మురికినీటితో చాలా ఇబ్బందులు పడేవారు. గ్రామ రోడ్డుకు గత వైసీపీ ప్రభుత్వం మొండిచేయి చూపింది. ఈ సమయంలో ఆ గ్రామానికి చెందిన నాయకుడు సంపతి ఉమాపతి ఆధ్వర్యంలో శ్రమదానం చేసి సిమెంటు రోడ్డు వేశారు. ప్రస్తుతం ఉమాపతి తమిళనాడు రాష్ట్రం ఓసూరులో ఉపాధ్యాయునిగా పనిచేస్తున్నారు. గ్రామ సమస్యను గుర్తించి ఇటీవల దసరా సెలవులు కావడంతో తోటి గ్రామస్థులు, బంధువులతో కలిసి దాతలు పులిగోరి చంద్రారెడ్డి తదితరుల సహకారంతో సిమెంటు పోగు చేశారు. తానే స్వయంగా ఇసుక, కంకర తదితర ఖర్చులు పెట్టుకుని గ్రామస్థుల సహకారంతో వారికి వారే మేస్త్రిని పెట్టుకుని సుమారు వంద మీటర్ల మేర నీరు నిలిచే ప్రాంతాన్ని ఎత్తుగా లేపి సిమెంటు రోడ్డు వేశారు. దీంతో గ్రామంలో మురికినీటి సమస్య పదేళ్ల తర్వాత తీరింది. ఈ సందర్భంగా సంపతి ఉమాపతి మాట్లాడుతూ గతంలో తాము శ్రమదానం ద్వారా అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేశామని, ప్రస్తుతం సిమెంటు రోడ్డు కూడా అదే స్ఫూర్తితో వేసినట్లు తెలిపారు. గతంలో సీఎం చంద్రబాబు ఇచ్చిన స్ఫూర్తితో గ్రామంలో బస్సుషెల్టర్, రోడ్లు, బడి, గుడి ఇతర అభివృద్ధి కార్యక్రమాలను చేశామని తెలిపారు.



నిన్న గ్రామం నట్టనడిరోడ్డులో నిలిచి ఉన్న మురుగునీరు



నేడు శ్రమదానంతో పూర్తి అయిన సిమెంట్ రోడ్డు

ఆ రోడ్లపై ప్రయాణం.. నరకం!

- ప్రొద్దుటూరు పట్టణంలో పలు ప్రధాన రోడ్లపై గుంతలు
- మైదుకూరు రోడ్డు, ఎర్రగుంట్ల బైపాస్ రోడ్డులో..
- మరమ్మతులు కూడా చేపట్టని వైనం
- పట్టించుకోని అధికారులు, ప్రజా ప్రతినిధులు

ప్రొద్దుటూరు , అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): ప్రొద్దుటూరు పట్టణంలోని పలు ప్రధాన రోడ్లపై గుంతలు పడి ప్రయాణికులకు నరకాన్ని చూపుతున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యారు. ఇక ద్విచక్ర వాహనదారులు, ఆటోల పరిస్థితి అధ్వానంగా తయారైంది. ప్రొద్దుటూరు పట్టణంలోని మైదుకూరు రోడ్డు దారుణంగా ఉంది. నిత్యం వేలాదిగా వాహనాలు ఆ రోడ్డుపై ప్రయాణిస్తుంటాయి. గత కొన్నేళ్లుగా మైదుకూరు రోడ్డు విస్తరణకు నోచుకోక దుర్భంగా మారింది. దీనికి తోడు రోడ్డుకు ఇరువైపులా కాలువలు లేక వర్షాలు వస్తే రోడ్లపై వర్షపు నీరు నిలిచి చెరువును తలపిస్తుంటాయి. ఇటీవల కొత్తపల్లె పంచాయతీ అధికారులు మైదుకూరు రోడ్డుకు ఒకవైపు మాత్రమే కాలువ నిర్మాణ పనులు చేపట్టారు. అదికూడా పూర్తి స్థాయిలో నిర్మాణం కాక అక్కడక్కడ కాలువ పెండింగ్‌లో ఉండటం వలన రోడ్డుపైకి కాలువలోని మురుగు నీరంతా ప్రవహిస్తోంది. దీంతో ప్రయాణికులకు తీవ్ర అసౌకర్యంగా ఉంటోంది. ఇక





ఎర్రగుంట్ల బైపాస్ రోడ్డులో పడిన గుంతలు



మైదుకూరు రోడ్డులోని హోండా షోరూం వద్ద ఏర్పడిన గుంత

ఆర్టీసీ బస్టాండ్ నుంచి కొత్తపల్లె బైపాస్ సర్కిల్ వరకు గుంతలతో దారుణంగా తయారై.. తరుచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. కానీ ఆర్‌అండ్‌బీ, పంచాయతీ అధికారులు కొన్ని గుంతలలో రాళ్లు పోసి పూడ్చే ప్రయత్నం చేశారు తప్ప రోడ్డుకు ప్యాచింగ్ పనులు కూడా చేపట్టలేదు. మైదుకూరు రోడ్డు నుంచి ఎర్రగుంట్ల బైపాస్ రోడ్డు వెళ్లే మార్గం గుంతలమయమై దుర్భరంగా ఉంది. ఎర్రగుంట్ల బైపాస్ రోడ్డు విస్తరణకు నిధులు విడుదలైనా విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్స్ షిఫ్టింగ్ పనులు ఏడాది కాలం పైగా ఆగిపోయాయి. పొట్టిపాడు రోడ్డు చిన్నశెట్టి పల్లె రోడ్లలో గుంతలకు ప్యాచింగ్‌లు కూడా వేయకపోవడంతో ఆ రోడ్లపై ప్రయాణం అంటే నరకాన్ని తలపిస్తోందని పట్టణ ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అధికారులు ఏమన్నారంటే: రోడ్లపై పడిన గుంతల విషయమై ఆర్‌అండ్‌బీ అధికారులను వివరణ కోరగా గుంతలు పూడ్చడనికి ప్రభుత్వం నిధులు విడుదల చేసిందని, త్వరలో టెండర్లు పిలిచి రోడ్లపై ప్యాచింగ్ పనులు పూర్తి చేస్తామన్నారు.

చట్టపరిధిలో న్యాయం చేయండి

కడప క్రైం, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదికకు వచ్చిన ఫిర్యాదుదారులకు చట్టపరిధిలో న్యాయం చేయాలని అదనపు ఎస్పీ (అడ్మిన్) కె.ప్రకాశ్‌బాబు పోలీసు అధికారులను ఆదేశించారు. జిల్లా పోలీసు కార్యాలయంలోని పెన్నార్ పోలీసు కాన్ఫరెన్స్ హాలులో జిల్లా ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్ ఆదేశాల మేరకు అదనపు ఎస్పీ (అడ్మిన్) కె.ప్రకాశ్‌బాబు సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కారవేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలతో అదనపు ఎస్పీ మాట్లాడి ఫిర్యాదులపై చట్టపరంగా చర్యలు తీసుకునేలా సంబంధిత పోలీసు అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన ఫిర్యాదుదారులకు పోలీసు సిబ్బంది ప్రశాంతంగా తమ సమస్యను వివరించడానికి సహాయం చేశారు. కార్యక్రమంలో స్పెషల్‌బ్రాంచ్ డీఎస్పీ ఎన్.సుధాకర్ పాల్గొన్నారు.

కస్తూర్బాపాఠశాల తనిఖీ



విద్యార్థినులతో మాట్లాడుతున్న స్టేట్ అకడమిక్ మానిటరింగ్ అధికారి

బ్రహ్మంగారిమఠం, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని కస్తూర్బా పాఠశాలను సోమవారం స్టేట్ అకడమిక్ మానిటరింగ్ అధికారి ఎం.అనురాధ (డిప్యూటీ డైరెక్టరు) ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలోని విద్యార్థినులతో ఆమె సమావేశమై స్థితిగతులు తెలుసుకున్నారు. అలాగే పాఠశాలలో ఏ విధంగా విద్యాబోధన చెబుతున్నారని, ప్రతిరోజూ ప్రభుత్వ ఆదేశాల మేరకు మెనూ సక్రమంగా నిర్వహిస్తున్నారా లేదా అని అడిగి తెలుసుకున్నారు. అలాగే రాబోవు పదవో తరగతి పరీక్షలల్లో మండలంలో మొదటిస్థానంలో పాఠశాలను నిలపాలని అధ్యాపకులకు సూచించారు. అలాగే పాఠశాల ఆవరణలో నిర్మిస్తున్న ఇంటర్మీడియట్ కళాశాల భవనాలను కూడా పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో కలసి ఆమె మధ్యాహ్న భోజనాన్ని భోంచేశారు. ఎంఈవో పుల్లయ్య, అధ్యాపకులు పాల్గొన్నారు.

రిమ్స్ పీజీ వైద్య విద్యార్థుల ప్రతిభ



ప్రతిభ కనబరిచిన వైద్య విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్

కడప సెవెన్ రోడ్స్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లలో రాష్ట్రస్థాయి 28వ మైక్రో బయాలజీ విజ్ఞాన సదస్సు ఈనెల 10, 11 తేదీలలో హైదరాబాద్‌లో నిర్వహించారు. ఈ సదస్సులో కడప ప్రభుత్వ వైద్య కళాశాల (రిమ్స్) మైక్రో బయాలజీ పీజీ విద్యార్థులు ద్వితీయ సంవత్సరానికి చెందిన డాక్టర్ దావూద్ సుహేల్ పెడగాగి విభాగంలో ద్వితీయ స్థానం, మొదటి సంవత్సరం పీజీ వైద్య విద్యార్థిని డాక్టర్ మైథిలి జనరల్ క్రిటికల్ థింకింగ్‌లో తృతీయ స్థానం సాధించారు. వీరిని ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ టి.జమున, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ విజయభాస్కర్‌రెడ్డి, తదితరులు అభినందించారు.

అనుమానాస్పద మృతి కాదు.. హత్యే

- కుమారుని మృతిపై తండ్రి ఫిర్యాదు
- విచారణకు ఎస్పీ ఆదేశం
- హత్యగా తేల్చిన వైనం

పెండ్లిమర్రి, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): పెండ్లిమర్రి పోలీసు స్టేషన్ పరిధిలో అనుమానాస్పద మృతిగా నమోదైన కేసును హత్యగా తేల్చారు. స్థానిక పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి చేతులు దులుపుకునేందుకు ప్రయత్నించగా ఎస్పీ నచికేత్ విశ్వనాథ్ ప్రత్యేకంగా విచారణ చేయించడంతో సైనైడ్ మర్డర్‌గా తేలింది. చివరికి ఇద్దరు నిందితులను అరెస్టు చేసి రిమాండుకు పంపించారు. ఇందుకు సంబంధించిన వివరాలిలా.. పెండ్లిమర్రి మండలం ఎం.చౌటుపల్లెకు చెందిన సుబ్బయ్య (46) ఈ ఏడాది మార్చి 29న రాత్రి 9గంటల ప్రాంతంలో మృతి చెందాడు. అప్పట్లో అనుమానాస్పద మృతిగా పోలీసులు కేసు నమోదు చేశారు. కనీసం అనుమానాస్పదంగా ఎలా మృతి చెందాడో కూడా పోలీసులు తేల్చలేదు. దీంతో తన కుమారుడిది అను మానాస్పద మృతి కాదని హత్య అని భావించిన మృతుడి తండ్రి పీజీఆర్‌ఎస్‌లో ఎస్పీ నచికేత్ విశ్వనాథ్‌కు ఫిర్యాదు చేశారు. కుమారుడి మృతిపై అనుమానం వ్యక్తం చేస్తూ ఫిర్యాదులో పేర్కొన్నారు. దీంతో ఎస్పీ ఓ డీఎస్పీ ద్వారా విచారణ చేయించారు. అయితే ఇది అనుమానాస్పద మృతి కాదని, సైనేడ్ కలిపి హత్య చేశారని నిర్ధారించారు. ఎస్పీ ఆదేశాల మేరకు పెండ్లిమర్రి సీఐ చల్లని దొర విచారణ చేయించి నిందితులను అరెస్టు చేశారు. చౌటుపల్లెకు చెందిన మృతుడు సుబ్బయ్య అదే గ్రామానికి చెందిన బాల అంకిరెడ్డి సతీమణిని వేధించేవాడు. దీంతో ఎలాగైనా సుబ్బయ్యను మట్టుబెట్టాలని నిర్ణయించాడు. ఆరవేటి మాచనూరు గంగిరెడ్డి సూచనల మేరకు మద్యంలో సైనెడ్ కలిపి చంపాలని నిర్ణయించుకున్నారు. ఈ నేపథ్యంలో మార్చి 29న బాల అంకిరెడ్డి మరి కొందరు మద్యం తాగుతుండగా ఆ సమయానికి సుబ్బయ్య అక్కడికి వచ్చారు. తనకు మద్యం కావాలని అడగ్గా సైనైడ్ కలిపిన మద్యాన్ని ఇచ్చారు. అది తాగి సుబ్బయ్య అక్కడికక్కడే మృతి చెందారు. విచారణలో అంకిరెడ్డిని, గంగిరెడ్డిని పోలీసులు అరెస్టు చేసి జైలుకు పంపించారు.

రైలుకింద పడి గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్య

ప్రొద్దుటూరు, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): ప్రొద్దుటూరు రైల్వే స్టేషన్ పరిధిలో పెన్నానది బ్రిడ్జి వద్ద రైల్వే ట్రాక్‌పై గుర్తు తెలియని వ్యక్తి రైలుకింద పడి ఆత్మహత్య చేసుకున్న సంఘటన చోటు చేసుకుంది. సోమవారం ఉదయం 8.30 గంటల సమయంలో నంద్యాల-రేణిగుంట్ల డెమో రైలుకింద పడి మరణించాడు. అతని వయస్సు 50 సంవత్సరాలు ఉంటుందని చెబుతున్నారు. రైలు కమ్మీమీద తల పెట్టి పడుకోవడంతో తల మొండెంతో వేరైంది. తల కూడా గుర్తు పట్టని తీరులో ఎగిరి పడింది. అతను చొక్కా లుంగీ ధరించి ఉన్నాడని, ఎరుపు తెలుపు గల్ల రంగు టవల్‌తో పడి వున్నాడని రైల్వే పోలీసులు తెలిపారు. అతని ఆచూకీ తెలిసిన వారు ఎర్రగుంట్ల రైల్వేస్టేషన్ హౌస్ ఆఫీసర్ 9700675792 నెంబరుకు ఫోన్ చేయాలని కోరారు.

ప్రియురాలు పెళ్లికి ఒప్పుకోలేదని...

- కత్తితో కోసుకున్న ప్రియుడు

పులివెందుల, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): పెళ్లి చేసుకునేందుకు ప్రియురాలు ఒప్పుకోలేదని ఓ ప్రేమికుడు కత్తితో తన ఒంటిపై పలు చోట్ల కోసుకున్నాడు. విషయం తెలుసుకున్న బంధువులు ఆసుపత్రికి తరలించారు. వివరాల్లోకెళితే.... పులివెందులలోని ప్రైవేటు డిగ్రీ కళాశాలలో ఓ విద్యార్థిని హాస్టల్‌లో ఉంటూ మొదటి సంవత్సరం చదువుకుంటోంది. మరో కళాశాలలో డిగ్రీ చదువుకుంటున్న విద్యార్థి ఇరువురు కొన్నిరోజులుగా ప్రేమించుకుంటున్నారు. సోమవారం రాజారెడ్డి పార్క్ సమీపంలో ఉన్న హాస్టల్ వద్దకు వచ్చి ప్రియురాలిని పిలిచాడు. కానీ ఆ ప్రియురాలు బయటకు రాలేదు. దీంతో ఆమె బంధువు సోదరి అయిన మహిళ వచ్చి ఆ విద్యార్థిని రాజారెడ్డిపార్క్ వద్దకు పిలుచు కెళ్లింది. ఇరువురిని పెళ్లికి ఒప్పించేందుకు ప్రయత్నించినట్లు తెలిసింది. కానీ ఆ విద్యార్థిని పెళ్లికి ఒప్పుకోకుండా తిరిగి హాస్టల్‌కు వెళ్లిపోయింది. దీంతో ప్రేయసికోసం ఒంటిపై పలుచోట్ల కోసుకున్నాడు. రక్తగాయాలతో వెళ్లిన అతన్ని చూసి చూసిన చుట్టుపక్కలవారు, స్నేహితులు కలిసి ఆసుపత్రికి తరలించారు. ఈ విషయాన్ని హాస్టల్ వార్డన్‌ను ఆంధ్రజ్యోతి వివరణ కోరగా.. జరిగిన సంఘటన గురించి విద్యార్థిని తల్లిదండ్రులకు సమాచారం ఇవ్వడంతో హాస్టల్ వద్దని లెటర్ రాసి ఆ విద్యార్థినిని ఇంటికి తీసుకెళ్లినట్లు వార్డన్ పేర్కొంది.

చోరీ కేసులో దొంగ అరెస్టు

జమ్మలమడుగు, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగు మున్సిపాలిటీ పరిధిలోని కాపు వీధిలో నివసిస్తున్న బ్యాంకు ఉద్యోగి బండి మనోహర్ ఇంటిలో ఈ నెల 1వ తేదీ చోరీ జరిగింది. బాధితుడు అర్బన్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు విచారణ చేసి సోమవారం గూడెంచెరువుకు చెందిన మెరుగు బాబు అనే యువకుడిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ రామకృష్ణ తెలిపారు. అతని వద్ద నుంచి ఒక బంగారు చెయిన్, చిన్న ఉంగరం స్వాధీనం చేసుకున్నామని ఎస్ఐ తెలిపారు.

అనుమతి లేకుండా ఆసుపత్రి నిర్వహిస్తున్న వ్యక్తి అరెస్టు

వేంపల్లె, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): వేంపల్లె పట్టణం కడప రోడ్డులో అనుమతి లేకుండా ఆసుపత్రి నిర్వహిస్తున్న విజయ్‌కుమార్‌ను అరెస్టు చేసినట్లు సీఐ నరసింహులు తెలిపారు. నిబంధనలకు విరుద్ధంగా ఆసుపత్రిలో ఆపరేషన్లు నిర్వహిస్తున్నట్లు అతనిపై ఫిర్యాదు రావడంతో డీఎస్పీ మురళి నాయక్ ఆదేశాలతో విజయ్‌కుమార్‌ను అరెస్టు చేసి, నాన్‌బెయిలబుల్ కేసు నమోదు చేశామన్నారు.

గ్రామ పంచాయతీ అభివృద్ధిలో సెక్రటరీలదే కీలక పాత్ర

- డీపీవో రాజ్యలక్ష్మి

కడప రూరల్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీ అభివృద్ధిలో సెక్రటరీలదే కీలక పాత్ర అని పంచాయతీశాఖ జిల్లా అధికారి (డీపీవో) రాజ్యలక్ష్మి పేర్కొన్నారు. సోమవారం జడ్పీ ఆవరణలోని డీపీఆర్‌సీ భవనంలో గ్రామ పంచాయతీ సొంత ఆదాయ వనరుల సృష్టి అనే అంశంపై పంచాయతీ సెక్రటరీలకు శిక్షణను నిర్వహించారు. ఈ సందర్భంగా డీపీవో మాట్లాడుతూ పంచాయతీ సెక్రటరీలు పంచాయతీ పరిధిలోని వనరుల ద్వారా ఆదాయాన్ని సమకూర్చుకొని తద్వారా పంచాయతీల అభివృద్ధికి తోడ్పాటును అందించాలన్నారు. గ్రామ పంచాయతీలోని ప్రతి గ్రామాన్ని స్వచ్ఛ గ్రామంగా తీర్చిదిద్ది తద్వారా స్వచ్ఛాంధ్రప్రదేశ్ దిశగా అడుగులు వేయాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పల్లె సీమల ప్రగతికి పెద్ద పీట వేస్తున్నాయన్నారు. అనంతరం గ్రామ పంచాయతీలో ఏఏ వనరులు ఉన్నాయి, వాటి ద్వారా ఆదాయాన్ని ఎలా సృష్టించుకోవాలి, సమకూరిన నిధులతో ప్రజలకు అవసరమైన అభివృద్ధి కార్యక్రమాలను ఎలా చేపట్టాలన్న అంశాలను తెలియపరిచారు. కార్యక్రమంలో డీపీఆర్‌సీ జిల్లా కో-ఆర్డినేటర్ రమణారెడ్డి, ట్రైనింగ్ మేనేజర్ సురేష్, ఉమ్మడి కడప జిల్లా నుంచి 50 మంది టాట్స్ మాస్టర్ ట్రైనర్లు, పంచాయతీ సెక్రటరీలు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డీపీవో రాజ్యలక్ష్మి

జీవన ఎరువులపై అవగాహన కల్పించాలి



తాడిగొట్లలో వ్యవసాయ కళాశాల విద్యార్థులు ఏర్పాటు చేసిన కృషి అనుభవ కార్యక్రమం

సీకేదిన్నె, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): జీవన ఎరువులపై రైతులకు అవగాహన కల్పించాలని డాట్ సెంటర్ సమన్వయకర్త క్రిష్ణప్రియ తెలిపారు. చింతకొమ్మదిన్నె మండలం తాడిగొట్లలో సోమవారం ఎస్వీ వ్యవసాయ కళాశాల తిరుపతి, ఎస్‌ఎంజీఆర్ వ్యవసాయ కళాశాల ఉదయగిరి విద్యార్థులకు జీవన ఎరువులపై గ్రామీణ అవగాహన కృషి అనుభవ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు స్థానికంగా, ప్రత్యక్షంగా వ్యవసాయంలో అనుభవం పొందడమేకాకుండా రైతుల్లో స్థిరమైన వ్యవసాయ పద్ధతులపై అవగాహన పెంచుకోవాలన్నారు. రైతులతో చర్చా కార్యక్రమాలు నిర్వహించి వారి అనుభవాలను తెలుసుకోవాలన్నారు. కార్యక్రమంలో స్థానిక రైతులు వ్యవసాయ విద్యార్థులు హర్షిణి, అమీనా, క్రిష్ణ, దుశల, దామిని, తదితరులు పాల్గొన్నారు.

16న ప్రభుత్వ పురుషుల కళాశాలలో మినీ జాబ్‌మేళా

కడప మారుతీనగర్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): జవహర్ నాలెడ్జ్ సెంటర్ (జేకేసీ) ఆధ్వర్యంలో ఈనెల 16వ తేదీ గురువారం నగర ప్రభుత్వ పురుషుల కళాశాల (స్వయంప్రతిపత్తి)లో మినీ జాబ్ మేళా కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆ కళాశాల ప్రిన్సిపాల్ జి.రవీంద్రనాథ్ తెలిపారు. ఇందులో హెటిరో ల్యాబ్స్ లిమిటెడ్, ఎన్ఐఐటీ, (యాక్సిస్‌బ్యాంక్) నెక్స్టెల్ మెటా ప్రయివేట్ లిమిటెడ్, అపోలో ఫార్మసీ తదితర సంస్థలు పాల్గొంటున్నాయని కో ఆర్డినేటర్ సీహెచ్ రాము వెల్లడించారు. ఇంటర్, డిగ్రీ, బి.టెక్, మాస్టర్ డిగ్రీ, అండ్ డిగ్రీ ఫైనల్ ఇయర్ చదువుతున్న విద్యార్థులు ఇందులో పాల్గొనేందుకు అర్హులన్నారు. ఈ జాబ్ మేళాలో పాల్గొనే ఔత్సాహికులు 4 సెట్స్ బయోడేటా, ఆధార్, పాన్‌కార్డుతో పాటు సర్టిఫికెట్స్ జిరాక్స్ ప్రతులతో హాజరు కావాలని కోరారు. వివరాలకు 9390052901, 9347256400 అనే నెంబర్లను సంప్రదించాలని సూచించారు.

ఈ-నామ్‌తో చీనీకి మెరుగైన ధర

- వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ అమర్‌నాథ్‌యాదవ్

పులివెందుల, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): పులివెందుల మార్కెట్ యార్డుకు వచ్చే చీనీ రైతులకు మెరుగైన ధరకోసం ఈ-నామ్ విధానం అమలు చేయబోతున్నామని వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ గడ్డం అమర్‌నాథ్‌యాదవ్ పేర్కొన్నారు. సోమవారం మార్కెట్ యార్డులోని తన కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. పులివెందులలో చీనీ వ్యాపారంపై కూటమి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. గతంలో వ్యాపారులు సిండికేట్ అయి తక్కువ ధర పాడుతున్నారని రైతుల నుంచి తీవ్ర ఆరోపణలు వచ్చాయన్నారు. ఆ సమయంలో కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి, టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి బీటెక్ రవి, మార్కెటింగ్ శాఖ అధికారులు సమన్వయంతో పలుమార్లు మార్కెట్ యార్డులోని చీనీవ్యాపారాన్ని పరిశీలించారన్నారు. రైతులను మోసం చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారన్నారు. రెండు నెలలుగా మార్కెట్ యార్డుపై రైతుల్లో సానుకూలత వస్తోందన్నారు. రైతులకు మార్కెట్‌పై నమ్మకం కలిగేందుకు మరిన్ని చర్యలు చేపడుతున్నామన్నారు. అందులో భాగంగా ఈ-నామ్ మార్కెటింగ్ విధానాన్ని 15వ తేదీ బుధవారం నుంచి అమలు చేయబోతున్నామన్నారు. ఈ విధానానికి ప్రతి ఒక్కరు మొగ్గు చూపితే ఆన్‌లైన్ ద్వారానే వ్యాపారాలు సాగుతాయన్నారు. పులివెందుల మార్కెట్ యార్డులో ఉన్న చీనీకాయలను ముంబై, ఢిల్లీ, చెన్నై తదితర నగరాల నుంచి సైతం వ్యాపారులు కొనుగోలు చేసేందుకు అవకాశం ఉంటుందన్నారు. రైతులు పంట అమ్మిన వెంటనే డబ్బు చెల్లించే వెసులుబాటు కూడా ఉంటుందన్నారు. ఈ-నామ్ పద్ధతితో రైతులందరికీ మేలు జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి శ్రీధర్ పాల్గొన్నారు.

మూగబోయిన జీవితం...

- భర్త ఆకస్మిక మరణం
- అనాథలైన భార్య, కూతురు

ప్రొద్దుటూరు/దువ్వూరు, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నీలాపురం గ్రామంలో కాశిపోయిన గంగయ్య ఆకస్మిక మరణంతో ఆ కుటుంబం అనాథగా మారింది. గంగయ్య నాగలక్షమ్మ దంపతులు దివ్యాంగులు (మూగవారు). వీళ్లు నిరుపేదకుటుంబానికి చెందినవారు. శనివారం ఇంటి నుంచి ప్రొద్దుటూరు మున్సిపాలిటీలో విధులకు వెళ్లిన గంగయ్య సోమవారం మృతిచెందాడనే విషయం తెలుసుకుని భార్యతోపాటు తొమ్మిదేళ్ల కూతురు మల్లిక శోకసముద్రంలో మునిగిపోయారు. గ్రామంలో మూగదంపతులు రేకుల షెడ్డుతో నిర్మించుకున్న ఇంటిలో నివశిస్తున్నారు. గంగయ్య నీలాపురంలో వ్యవసాయ కూలి పనులకు వెళుతూ కుటుంబాన్ని పోషించేవాడు. మూడేళ్ల కిందట ప్రొద్దుటూరు డంపింగ్‌యార్డులో గంగయ్య విధుల్లో చేరినట్లు స్థానికులు తెలిపారు. దీంతో లభిస్తున్న జీతంతో కుటుంబ భారాన్ని నెట్టుకొస్తున్నాడు. ఈ క్రమంలో శనివారం విధులకు వెళ్లి తిరిగి రాకపోవడంతో కుటుంబీకుల్లో ఆందోళన మొదలై వాకబు చేస్తూ వచ్చారు. సోమవారం ఉదయం విధులు నిర్వహించే పరిసరాల్లో బహిర్భూమికి వెళ్లి మృతి చెంది ఉన్నట్లు సమాచారం తెలుసుకుని భార్య, కూతురు బోరున విలపించారు. భర్తను కోల్పోయిన నాగలక్ష్మి, ఆమె కూతురు మల్లిక రోదన అక్కడి చూపరులను కలిచివేసింది.

అనుమానాస్పద స్థితిలో మృతి

ప్రొద్దుటూరు పట్టణంలోని పొట్టిపాడు రోడ్డులోని మున్సిపల్ కంపోస్టుయార్డులో పారిశుధ్య కార్మికుడిగా పనిచేస్తున్న కాశిపోయిన గంగయ్య (41) అనుమానాస్పదస్థితిలో మృతి చెందాడు. వివరాల్లోకి వెళితే... దువ్వూరు మండలం నీలాపురం గ్రామానికి చెందిన గంగయ్య దివ్యాంగుడు (మూగవారు). దీంతో ఇతనికి బ్యాక్‌లాగ్ కింద మున్సిపాలిటీలో పారిశుధ్య కార్మికుడిగా ఉద్యోగం వచ్చింది. శనివారం ఉదయం 7.30 గంటలకు కంపోస్టుయార్డులో డ్యూటీకి వచ్చిన గంగయ్య మధ్యాహ్నం 11 గంటల వరకు విధుల్లో ఉన్నట్లు అక్కడి సిబ్బంది తెలి పారు. 11.30 గంటలకు డ్యూటీ అయిపోగానే ఎవరికి



కాశిపోయిన గంగయ్య (ఫైల్), అనాథలైన భార్య, కూతురు

వారు ఇళ్లకు వెళ్లిపోయారు. గంగయ్య శనివారం నీలాపు రంలోని తన ఇంటికి రాకపోవడంతో అతని భార్య, బంధువులు ఆదివారం ప్రొద్దుటూరుకు వచ్చి మున్సిపాలిటీలో విచారించారు. గంగయ్య ఆచూకీ తెలియకపోవడంతో మధ్యాహ్నం రూరల్ పోలీ సుస్టేషన్‌లో బంధువులు మిస్సింగ్ అయినట్లు ఫిర్యాదు చేశారు. సోమవారం ఉదయం కంపోస్టు యార్డులో డోజర్ ఆపరేటర్ బహిర్భూమికి వెళ్లగా.. అక్కడ పురుగులు పట్టిన గంగయ్య మృతదేహాన్ని చూసి మున్సిపల్ అధికారులకు తెలియజేశారు. వెంటనే మున్సిపల్ అధికారులు రూరల్ పోలీసులకు సమాచారం ఇవ్వగా విచారించారు. గంగయ్య మల విసర్జన కోసం కంపోస్టుయార్డులోని పల్వరైజింగ్ మిషన్ సమీపంలో సందులోకి వెళ్లి గుండెపోటు వచ్చి మరణించి ఉండవచ్చని అను మానం వ్యక్తం చేశారు. అతను మలవిసర్జనకు కూర్చున్న పొజిషన్‌లోనే ముందుకు పడి ఉన్నట్లు గుర్తించారు. మృత దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా ప్రభు త్వ ఆసుపత్రికి తరలించారు. పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. గంగయ్య భార్య కూడా మూగ చెవిడు వున్న దివ్యాంగురాలు. వీళ్లకు ఒక ఆడబిడ్డ వుంది.

సంబేపల్లె ఎంపీడీవోగా వెంకటసుబ్బారెడ్డి

రాయచోటి-నేతాజీ సర్కిల్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): సంబేపల్లె మండల పరిషత్ అభివృద్ధి అధికారిగా టీ. వెంకటసుబ్బారెడ్డి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. చింతకొమ్మదిన్నె మండలంలో పనిచేస్తున్న ఆయన పదోన్నతిపై సంబేపల్లె ఎంపీడీవోగా నియమితులయ్యారు. ఇక్కడ ఎంపీడీవోగా పనిచేసిన రామచంద్ర కుప్పం డీడీవోగా నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ ప్రజలకు అందుబాటులో ఉండి అధికారుల సమన్వయంతో మండల పరిషత్ అభివృద్ధికి తనవంతు సహకారం అందిస్తానని తెలియజేశారు. మండల స్థాయి అధికారులు అభివృద్ధికి సహకరించాలని కోరారు.

ఉపాధి కూలీలకు ఈకేవైసీ తప్పనిసరి : ఏపీఓ

చిన్నమండెం, అక్టోబరు13(ఆంధ్రజ్యోతి): జాబ్ కార్డు కలిగిన ఉపాధి కూలీలందరూ తప్పనిసరిగా తమ ప్రాంతంలోని ఫీల్డ్ అసిస్టెంట్ వద్ద ఈకేవైసీ చేయించాలని ఏపీవో మురళి సూచించారు. సోమవారం ఆయన పొలిమేరపల్లిలో పర్యటించి కూలీలతో ఈకేవైసీ చేయించారు.

ప్లాస్టిక్ వ్యర్థాల తొలగింపు

సిద్దవటం, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి) : వన్య ప్రాణుల సంరక్షణలో భాగంగా లంకమల అభయారణ్యంలో ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగిస్తున్నామని నిత్యపూజేశ్వరాలయ ఇన్‌చార్జి ఈవో శ్రీధర్ తెలిపారు. మండలంలోని నిత్యపూజేశ్వరకోన పంచలింగాల గుడి వద్ద సోమవారం ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దర్శనానికి వచ్చే భక్తులు ప్లాస్టిక్ కవర్లు తీసుకురాకూడదని తెలిపారు.

రైల్వేగేటు పడిందా.. అంతే సంగతులు!

- తరచూ మునుగుతున్న ఆర్‌యూబీ
- గ్రామస్తులకు తప్పని ట్రాఫిక్ కష్టాలు

నందలూరు, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి) : రైల్వేలైనుపై గేట్లను ఎత్తివేసే క్రమంలో దాదాపు కోటి రూపాయలకు పైగా ఖర్చుపెట్టి నందలూరు రైల్వేకేంద్రంలో నిర్మిస్తున్న ఆర్‌యూబీ పనులు పూర్తి కాకపోవడంతో ఈ ప్రాంతంలో ట్రాఫిక్ సమస్య తీవ్రంగా మారింది. గేటు మూసివేసినపుడు ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నందలూరు మండలంలోని నాగిరెడ్డిపల్లె మేజర్ గ్రామ పంచాయతీలో రైల్వేలైనుకు ఇరువైపులా పట్టణం విస్తరించి ఉండడంతో పాటు వేల సంఖ్యలో గృహాలు వివిధ కార్యాలయాలు, పాఠశాలలతో పాటు ఇరువైపులా గ్రామీణ ప్రాంతాలు కూడా


నీళ్లతో నిండిపోయిన ఆర్‌యూబీ (ఫైల్)

అధిక సంఖ్యలో ఉన్నాయి. అందుకు అనుగుణంగా వాహనాల రాకపోకలు కూడా ఉంటాయి. వీరంతా ఎక్కడికి వెళ్లాలన్నా రైల్వే గేట్ దాటి వెళ్లాల్సిందే. అయితే రైల్వే లైన్లపై ఉన్న గేట్ల సంఖ్యను తగ్గించడంలో భాగంగా కొన్నేళ్ల క్రితం రైల్వే శాఖ నందలూరు రైల్వేకేంద్రంలో ఉన్న రైల్వేగేట్లు ఎత్తివేసి ఆర్ యూబీ నిర్మిస్తోంది. ప్రస్తుతం అది పూర్తి కానందున


రైల్వేగేట్ మూసివేయడంతో ఆగిన వాహనాలు

ట్రాఫిక్ సమస్య తీవ్రమవుతోంది భారీ ఆర్‌యూబీ నిర్మాణం ఎప్పుడు పూర్తి అవుతుందా అని తమ కష్టాలు ఎప్పుడు తీరుతాయా నాగిరెడ్డిపల్లె వాసులు ఎదురు చూస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు వీలైనంత త్వరగా నిర్మాణంలో ఉన్న ఆర్‌యూబీపనులను పూర్తి చేసి వినియోగంలోకి తేవాలని స్థానికులు కోరుతున్నారు.

జీఎస్టీ ఫలాలు అందరూ అందుకోవాలి

- రాజంపేట నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి చమర్తి పిలుపు

రాజంపేట, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): జీఎస్టీ తగ్గింపుతో ప్రతి కుటుంబానికి కొంత మొత్తం ఆదా అవుతుందని రాజంపేట టీడీపీ ఇన్‌చార్జి చమర్తి నిర్వహించిన అవగాహన ర్యాలీని ఆయన జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం రాజంపేట సబ్‌కలెక్టర్ సభాభవనంలో జీఎస్టీ అవగాహనపై నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ జీఎస్టీ తగ్గింపుతో ప్రతి నిరుపేద కుటుంబానికి రూ.6 వేల నుంచి రూ.15 వేల వరకు ఆదా అవుతుందన్నారు. ఈ సందర్భంగా జీఎస్టీ తగ్గింపుపై గణాంకాలను వివరించారు. ఈ కార్యక్రమంలో సబ్‌కలెక్టర్ కార్యాలయ పరిపాలన అధికారి శ్రీధర్, జీఎస్టీ స్పెషలాఫీసర్ నాగేంద్ర, తహసీల్దారు పీర్‌మున్నీ, మున్సి


రాజంపేట: సమావేశంలో మాట్లాడుతున్న చమర్తి జగన్‌మోహన్‌రాజు

ఎల్ కమిషనర్ శ్రీనివాసులు, ఎంపీడీవో వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సుండుపల్లె: జీఎస్టీ తగ్గించి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలకు సూపర్ గిఫ్ట్ ఇచ్చాయని ఎంపీడీవో సుధాకర్‌రెడ్డి, ఎంఈవోవీరవీంద్రనాయక్ తెలిపారు. సోమవారం ఎంపీడీవో కార్యాలయం



సుండుపల్లె: జీఎస్టీపై అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు

నుంచి మండల కేంద్రం వరకు ర్యాలీ నిర్వహించి జీఎస్టీపై అవగాహన కల్పించారు.

నందలూరు: ఎంపీపీ మేడా విజయభాస్కర్‌రెడ్డి, ఎంపీడీవో రాధాకృష్ణన్ ఆధ్వర్యంలో ఎంపీడీవో కార్యాలయంలో జీఎస్టీపై అవగాహన సదస్సు నిర్వహించారు.

15 నుంచి మెరుపు సమ్మెకు సిద్ధం కావాలి

- విద్యుత్ కార్మికుల యూనియన్ స్ట్రగుల్ కమిటీ పిలుపు

రాయచోటిటౌన్, అక్టోబరు13(ఆంధ్రజ్యోతి): ఈ నెల 15 నుంచి విద్యుత్ కార్మికులు మెరుపు సమ్మెకు సిద్ధం కావాలని రాయచోటి విద్యుత్ స్ట్రగుల్ కమిటీ పిలుపునిచ్చింది. సోమవారం కమిటీ నాయకులు రాయచోటి పట్టణంలోని విద్యుత్ కార్యాలయం ఎదుట సమ్మెకు సంబంధించిన కరపత్రాలు విడుదల చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ తెలంగాణ తరహాలో విద్యుత్ కాంట్రాక్ట్ అండ్ ఔట్‌సోర్సింగ్ కార్మికులను రెగ్యులర్ చేయాలని, వన్ ఇండస్ట్రీ వన్ సర్వీస్ రెగ్యులేషన్స్ ఇంప్లిమెంట్ చేసి గ్రేడ్ 2 కార్మికులకు న్యాయం చేయాలని, పాత పెన్షన్ పద్ధతిని పునరుద్ధరించే వరకు పోరాటాలు కొనసాగించాలని పిలుపునిచ్చారు. సమస్యలు శాంతియుత వాతావరణంలో పరిష్కరించాలని, లేని పక్షంలో సమ్మెకు సిద్ధంగా ఉన్నామని, జరగబోయే పరిణామాలకు యాజమాన్యమే బాధ్యత వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో రాయచోటి విద్యుత్ స్ట్రగుల్ కమిటీ చైర్మన్ పోతులూరి సుదర్శన్ రెడ్డి, యూఈసీడబ్ల్యుయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కే. సుబ్రమణ్యంరాజు, యూఈఈయూ డివిజన్ కార్యదర్శి ఏవీ రమణ, యూఈసీడబ్ల్యుయూ డివిజన్ కార్యదర్శి శ్రీనివాసులరెడ్డి, అధ్యక్షులు నాగేశ్‌గౌడ్, రాయచోటి విద్యుత్ స్ట్రగుల్ కమిటీ నాయకులు గంగన్న, రెడ్డెప్ప, ఖాదర్‌బాషా, భూషణ, ముస్తాక్


విద్యుత్ అధికారికి సమ్మె నోటీసు ఇస్తున్న కమిటీ నేతలు

అహ్మద్, రాంబాబు, చెంచయ్య తదితరులు పాల్గొన్నారు.

రైల్వేకోడూరు : ప్రధాన సబ్ స్టేషన్ వద్ద కాంట్రాక్టు విద్యుత్ కార్మికులు ఆందోళన చేశారు. యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి కనుపర్తి కిరణ్ ఏపీ విద్యుత్ ట్రేడ్ యూనియన్స్ స్ట్రగుల్ కమిటీ నాయకులు వీ. సుబ్రహ్మణ్యం, సీ. నారాయణ, బాలకృష్ణ, రమేష్, సురేష్, శివ, బాషా, నాగరాజు, ఆర్. ఈశ్వర్‌రావు, సుధాకర్, జయకృష్ణ, అంకయ్య, చిన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

రాజంపేట: స్థానిక విద్యుత్ కార్యాలయం ఎదుట కరపత్రాలను చేతపట్టి ఆందోళన చేశారు యూఈఈయూ జిల్లా కార్యదర్శి శ్రీహరి, యుఈ సీడబ్ల్యూయూ డివిజన్ కార్యదర్శి బాలకృష్ణ, స్థానిక అధ్యక్షుడు సుధాకర్ పాల్గొన్నారు.

న్యాయమూర్తిపై దాడి.. రాజ్యాంగంపై దాడి


నిరసన వ్యక్తం చేస్తున్న ఎంఆర్‌పీఎస్ నాయకులు

రాయచోటి కలెక్టరేట్ , అక్టోబరు13(ఆంధ్రజ్యోతి): సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి భూషణ్‌రామకృష్ణ గవాయ్‌పై దాడి చేసిన రాకేశ్‌కిశోర్‌పై సుమోటోగా కేసు నమోదు చేసి వెంటనే అరెస్టు చేయాలంటూ ఎంఆర్‌పీఎస్ నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టర్ కార్యాలయం ముందు నల్ల జెండాలు, ఎంఆర్‌పీఎస్ జెండాలతో నిరసన ధర్నా చేసిన అనంతరం కలెక్టర్ నిశాంత్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంఆర్‌పీఎస్ జిల్లా ఇన్‌చార్జి కోట దానియల్‌మాదిగ తదితరుల పాల్గొన్నారు.

'డీజే'తో ప్రజలకు ఇబ్బంది కలిగిస్తే చర్యలు

రాయచోటి టౌన్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): డీజే సౌండ్ సిస్టంతో ప్రజలకు ఇబ్బంది కలిగిస్తే చర్యలు తప్పవని రాయచోటి అర్బన్ ఎస్ఐ విష్ణువర్ధన్ హెచ్చరించారు. సోమవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో రాయచోటి పట్టణ, మండల పరిధిలోని వివిధ డీజే సౌండ్‌సిస్టంల యజమానులు, యూనియన్ సభ్యులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పట్టణ పరిధిలో డీజే సౌండ్ సిస్టం ఏర్పాటు చేయాలనుకుంటే ముందుగా పోలీసుల నుంచి తప్పనిసరిగా అనుమతి పొందాలని ఆదేశించారు. రాత్రి 10 గంటల తరువాత శబ్దస్థాయిని తగ్గించి ప్రజలకు ఇబ్బంది కలగకుండా కార్యక్రమాలు నిర్వహించుకోవాలని, నిబంధనలు ఉల్లంఘించిన యాజమాన్యాలపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

సమ్మెకాలపు హామీలు అమలు చేయాలి

రాయచోటిటౌన్, అక్టోబరు13(ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ కార్యకర్తలకు సమ్మెకాలపు హామీలు అమలు చేయాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి అబ్బవరం రామాంజులు డిమాండ్ చేశారు.మినీ అంగన్‌వాడీలను మెయిన్ కేంద్రాలుగా మారుస్తున్నట్లు ప్రభుత్వం ప్రకటించడంతో సోమవారం స్థానిక ఎన్జీవో హోంలో ఏపీ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సీఐటీయూ) జిల్లా అధ్యక్షురాలు శ్రీలక్ష్మి అధ్యక్షతన అభినందన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మినీ వర్కర్ల నిరవధిక పోరాటాలతో ప్రభుత్వం మినీ సెంటర్లను మెయిన్ కేంద్రాలుగా మార్చిందన్నారు. 2023లో నిర్వహించిన 42 రోజుల సమ్మె కాలపు హామీలు అమలు చేయాలన్నారు. పెరిగిన ధరలకు అనుగుణంగా కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలన్నారు.

మా పొలాలను.. మమ్మల్ని కాపాడండి సారూ...

- తహసీల్దారుకు మహిళ ఫిర్యాదు

చిన్నమండెం, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): ఎలాంటి సంబంధం లేని కొందరు తమను భయభ్రాంతులకు గురి చేసి తమ భూమిని ఆక్రమించడంతోపాటు, తమపై దౌర్జన్యం చేశారని, వారి బారినుంచి తమ భూమితోపాటు, తమన కాపాడాలంటూ ఓ మహిళ సోమవారం తహసీల్దారుకు విన్నవించుకుంది. వివరాలిలా ఉన్నాయి. మండల కేంద్రంలో నివాసం ఉంటున్న సులోచనమ్మకు సర్వే 106లో 50 సెంట్లు, సర్వే నెంబర్ 107లో 28 సెంట్లు, సర్వేనెంబర్ 125/1లో 27 సెంట్ల భూమి ఉంది . ఈ భూమిని వరి సాగుకు సిద్ధం చేస్తుండగా కొందరు తమపై దౌర్జన్యం చేసి భయభ్రాంతులకు గురి చేస్తున్నారని, వారిపై తగు చర్యలు తీసుకోవాలని తహసీల్దార్ నరసింహులుకు ఫిర్యాదు చేశారు. దీనిపై గతంలో పోలీస్‌స్టేషన్‌తోపాటు స్పందన కార్యక్రమంలో కూడా ఫిర్యాదు చేశామని రికార్డులను పరిశీలించి తమకు న్యాయం చేయాలని తహసీల్దార్‌కు విన్నవించుకున్నారు.

'ప్రపంచ స్థాయి రాజధాని ముఖ్యమంత్రి ఆశయం'

రాయచోటిటౌన్, అక్టోబరు13(ఆంధ్రజ్యోతి): 25 పార్లమెంట్ స్థానాలకు కేంద్రంగా ఉన్న ప్రదేశాన్ని రాజధానిగా ఎంపిక చేసి ప్రపంచ స్థాయి రాజధానిని నిర్మించాలన్నదే ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆశయమని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి, కుప్పం నియోజకవర్గ పరిశీలకుడు గాజుల ఖాదర్‌బాషా తెలిపారు. సోమవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ రాజధాని నిర్మాణం కోసం చంద్రబాబు పిలుపుతో రైతులు స్వచ్ఛందంగా వచ్చి 34 వేల ఎకరాలు ఇవ్వడం ఒక చరిత్ర అన్నారు. అమరావతి రాజధాని నిర్మాణం కోసం రోడ్డెక్కి శాంతియుతంగా ధర్నాలు చేసిన రైతులను పలురకాలుగా హింసించి వారిపై కేసులు పెట్టిలాఠీలతో చితకబాదిన చరిత్ర వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి దక్కుతుందని తెలిపారు. అమరావతి రాజధానికి పరిశ్రమలు తెచ్చేందుకు రాత్రింబవళ్లు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్‌బాబు కష్టపడుతున్నారని తెలిపారు. ప్రతి ఇంటి నుంచి ఒక పారిశ్రామికవేత్త రావాలని, అది అమరావతి నుంచి ప్రారంభం కావాలని ముఖ్యమంత్రి చంద్రబాబు తెలిపారన్నారు. రైతులందరూ సుఖంగా సంతోషంగా ఉండాలన్నదే చంద్రబాబు ధ్యేయమన్నారు. అమరావతి రాజధాని నిర్మాణం ప్రారంభం కావడంతో రైతుల్లో ఆనందం వెల్లివిరుస్తోందన్నారు.

ఎన్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో స్వచ్ఛభారత్

పెనగలూరు, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి) : ఎన్ఎస్ఎస్ ప్రత్యేక శిబిరంలో భాగంగా పెనగలూరు ఆదర్శ పాఠశాల జూనియర్ కళాశాల విద్యార్థులు సోమవారం కంబాలకుంటలోస్వచ్ఛ భారత్ కార్యక్రమం నిర్వహించారు. ఆదర్శ పాఠశాల జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ సహజబ్లెస్సీ లాంఛనంగా కార్యక్రమాన్ని ప్రారంభించారు. వారం రోజుల పాటు కంబాలకుంట పరిసర ప్రాంతాల్లో ఎన్ఎస్ఎస్ యూనిట్-1 ప్రోగ్రాం ద్వారా పలు సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని ప్రోగ్రాం ఆఫీసర్లు డాక్టర్ ఎల్.హేమలత, కృష్ణవేణి తదితరులు తెలిపారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

రైల్వేకోడూరు, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలువురికి సోమవారం ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ అరవ శ్రీధర్ సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని శెట్టిగుంట


శెట్టిగుంటలో బాధితుడికి చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే అరవ శ్రీధర్

కు చెందిన ఉప్పరపాటి వెంకటేశ్వరరావుకు రూ. 39,084, వెంకటరెడ్డిపల్లెకు చెందిన మల్లు అంజలి కి రూ. 20,000లు, మాధవరంపోడు గ్రామానికి చెందిన మారే రామలక్షుమ్మకు రూ. 30,786 సీఎంఆర్‌ఎఫ్ నిధులు మంజూరయ్యాయన్నారు. గతంలో బాధితులు అధికారపార్టీ కార్యాలయాలకు వెళ్లి చెక్కులు తీసుకునే వారని, ప్రస్తుతం తాము బాధితుల ఇంటికి వెళ్లి చెక్కులు ఇస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో యువనాయకుడు ముక్కా సాయివికాస్‌రెడ్డి, కూటమి నాయకులు బత్తిన వేణుగోపాల్‌రెడ్డి, కంచిరాజు రామరాజు, రామసుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైద్యుల ఆందోళనకు సిబ్బంది సంఘీభావం

రామాపురం, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లోని వైద్యులు నిర్వహిస్తున్న ఆందోళనకు సోమవారం రామాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది నల్లబ్యాడ్జీలు


నల్లబ్యాడ్జీలతో నిరసన తెలుపుతున్న పీహెచ్‌సీ వైద్య సిబ్బంది

ధరించి మద్దతు తెలిపారు. సోమవారం వారు మాట్లాడుతూ ప్రభుత్వం వెంటనే స్పందించి వైద్య ఆరోగ్యశాఖలో ఉన్న దీర్ఘకాలిక సమస్యలను పరిష్కరించాలని కోరారు. వైద్యులు గ్రామీణ ప్రాంతాల్లో తీవ్ర ఇబ్బందులతో సేవలు అందిస్తున్నా సరైన గుర్తింపు, ప్రోత్సాహం లభించకపోవడం బాధాకరమన్నారు. ప్రభుత్వ వైద్యుల హక్కులను గౌరవించి ఆరోగ్య వ్యవస్థ బలోపేతానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని కోరారు.

భూ సమస్యల పరిష్కారానికి కృషి

సిద్దవటం, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి) : భూ సమస్యల పరిష్కారం కోసం నిరంతరం కృషి చేస్తానని తహసీల్దారు ఆకుల తిరుమలబాబు తెలిపారు. సోమవారం సిద్దవటం తహసీల్దారు కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కారవేదిక నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సోమశిల ముంపు వాసులకు కేటాయించిన ఇళ్ల స్థలాలు అన్యాక్రాంతమైనట్లు పెద్దపల్లి, శాఖరాజుపల్లె, రెవెన్యూ పరిధిలోని మాధవరం, ఉప్పరపల్లె గ్రామాల నుంచి ఫిర్యాదులు వచ్చాయని, ఈ సమస్య పరిష్కరిస్తామని తెలిపారు.

గ్రామ నౌకర్ల వేతనం రూ.26 వేలకు పెంచాలి

సిద్దవటం, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి) : గ్రామ నౌకరకు ప్రస్తుతం ఇస్తున్న వేతనం రూ.26 వేలకు పెంచాలని సిద్దవటం మండలం వీఆర్‌ఏల సంఘం అధ్యక్షుడు బోవిళ్ల దేవరాజ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సిద్దవటం


నిరసన తెలుపుతున్న వీఆర్‌ఏలు

లో సోమవారం నిర్వహించిన మండల వీఆర్‌ఏల సమావేశంలో ఆయన మాట్లాడుతూ చదువుకున్న వీఆర్‌ఏలకు పదోన్నతి కల్పించాలన్నారు. నామినీలుగా ఉన్న వీఆర్‌ఏలను రెగ్యులర్ చేయాలన్నారు. వీఆర్‌ఏలకు రాత్రి వేళల్లో డ్యూటీలు వేస్తున్నారని, పగలంతా వీఆర్వో దగ్గర పనిచేసి, రాత్రికి మళ్లీ డ్యూటీ చేయడం సమస్యగా మారుతోందన్నారు. ఈ కార్యక్రమంలో వీఆర్‌ఏల సంఘం అధ్యక్షురాలు అమరావతి, ప్రధాన కార్యదర్శి కిశోర్, కోశాధికారి టీవీ రమణ, సంఘ సభ్యుడు కొండయ్య, ఎం.వెంకటసుబ్బయ్య, తులసి, వెంకటసుబ్బన్న, శ్రావణి, బి.వెంకటసుబ్బయ్య లక్ష్మీదేవి, సుబ్బమ్మ తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులకు నిధులు మంజూరు

పెనగలూరు, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని వినాయక నగర్‌లో సి మెంటు రోడ్డు ఏర్పాటుకు రూ.6.40 లక్షల నిధులు మంజూరయ్యాయి.. కుడా చైర్మన్ ముక్కా రూపానందరెడ్డి, ఎమ్మెల్యే అరవ శ్రీధర్ నివేదికలు తయారు చేయించి పనులు మంజూరు కోసం ఉన్నతాధికారులకు పంపించారు. రెండు మూడు రోజుల్లో ఎమ్మెల్యే, కుడా చైర్మన్‌తో పాటు, టీడీపీ నాయకురాలు ముక్కా వరలక్ష్మి పనులు ప్రారంభిస్తారని సోమవారం మండల టీడీపీ నాయకులు బీఎల్ నరసింహారెడ్డి, పతకమూరి యానాదయ్యనాయుడు, ఆకుల చిన్న పెంచలయ్య తెలిపారు.

నకిలీ మద్యం అరికట్టాలి

రైల్వేకోడూరు, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో నకిలీ మద్యం విక్రయాలను అరికట్టాలని మాజీ ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు డిమాండ్ చేశారు. సోమవారం రైల్వేకోడూరు ఎక్సైజ్ కార్యాలయం వద్ద వైసీపీ నాయకులు, కార్యకర్తలు ధర్నా నిర్వహించారు. అనంతరం ఎక్సైజ్ అధికారులకు వినతిపత్రం సమర్పించారు. వైస్ ఎంపీపీ రామిరెడ్డి ధ్వజారెడ్డి, నాయకులు ముద్దా బాబుల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రాజంపేట టౌన్: రాజంపేట ఎక్సైజ్ కార్యాలయం ఎదుట వైసీపీ మహిళలు నిరసన ప్రదర్శించారు. ప్లకార్డులు చేతబట్టి కార్యాలయం ఎదుట కూర్చుని నినాదాలు చేశారు. వైసీపీ రాజంపేట మహిళా అధ్యక్షురాలు మిరియాల సురేఖ, సిద్దవటం మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌ఎస్‌ఎస్ అధికారుల సేవలు అభినందనీయం

వీరబల్లి, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ జూనియర్ కళాశాల ఎన్ఎస్ఎస్ అధికారుల సేవలు అభినందనీయమని ప్రిన్సిపాల్ అజంతుల్లా అన్నారు. సోమవారం ఎన్ఎస్ఎస్ స్పెషల్ క్యాంపులో భాగంగా పెద్ద మాదిగపల్లెలో


సర్వే చేస్తున్న ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు

సుమారు 50 మందికి పైగా ఎన్ఎస్ఎస్ వలంటీర్లు సామాజిక సాధికారిక సర్వే నిర్వహించారు. ప్రతి ఇంటికి వెళ్లి యజమాని వివరాలు, విద్యార్హత, సంవత్సరాదాయం, పంటల మీద పెట్టుబడి, దిగుబడి, పిల్లల విద్యార్హతలు ఉద్యోగాలు సంక్షేమ పథకాలు అందకపోవడం వంటి విషయాలను సేకరించారని ప్రోగ్రాం ఆఫీసర్ భాస్కర్, రఘురామయ్య తెలిపారు.

డైట్ పార్క్ దగ్గర ఆక్రమణలు తొలగించాలి

రాయచోటి (కలెక్టరేట్), అక్టోబరు13(ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని డైట్ పార్క్ దగ్గర ఆక్రమణలు తొలగించాలంటూ స్థానికులు సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన పీజీఆర్‌ఎస్‌లో ఫిర్యాదు


కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న రాయచోటి ప్రజలు

చేశారు. గత నెల 19న వర్షానికి డ్రైనేజీలు పొంగడంతో 8 ఏళ్ల బాలిక మృతి చెందిందని ఫిర్యాదులో పేర్కొన్నారు. గతంలో ఈ ప్రాంతంలో ఒక వాగు ఉండేదని దానిని ఆక్రమించి కట్టడాలు నిర్మించడం వల్లనే ఇలాంటి పరిస్థితులు తలెత్తుతున్నాయని వివరించారు. ఈ విషయంపై ప్రజా ప్రతినిధులు, అధికారులు చొరవ తీసుకొని మరొకమారు ఇలాంటి పరిస్థితులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని వారు అర్జీలో పేర్కొన్నారు.

దేవదాయశాఖ ఈవోగా వెంకటసుబ్బారెడ్డి

రాజంపేట టౌన్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి) : రాజంపేట డివిజన్ దేవదాయ ధర్మాదాయశాఖ ఈవోగా ఎన్.వెంకటసుబ్బారెడ్డి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన చిత్తూరు జిల్లా నుంచి రాజంపేటకు బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజంపేట డివిజన్ పరిధిలోని ఆలయాల అభివృద్ధికి, పవిత్రతను కాపాడడానికి తాను పాటుపడతానని తెలిపారు.

ధర్నా చేస్తే.. టమోటాలు కొనాలా...?!

- తగ్గేదేలేదంటూ అధికారులకు వ్యాపారుల హెచ్చరికలు
- కడప-బెంగళూరు జాతీయ రహదారిపై రైతుల ధర్నా
- స్తంభించిన ట్రాఫిక్
- బారులు తీరిన వాహనాలు
- మార్కెట్ యార్డు వద్ద ఉద్రిక్తత
- పోలీస్, రెవెన్యూ అధికారుల జోక్యంతో ధర్నా విరమణ


జాతీయ రహదారిపై ధర్నా చేస్తున్న రైతులు, (ఇన్‌సెట్లో) పోలీసులతో వాదిస్తున్న రైతులు

గుర్రంకొండ, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): గుర్రంకొండ టమోటా మార్కెట్‌యార్డు వద్ద సోమవారం జాక్‌పాట్ విధానాన్ని రద్దు చేయాలంటూ వందలాది మంది రైతులు వ్యాపారుల తీరును నిరసిస్తూ కడప-బెంగుళూరు జాతీయ రహదారిపై ధర్నా, రాస్తారోకో నిర్వహించారు. సుమారు రెండు గంటలకు పైగా ధర్నా చేయడంతో వాహనాలు బారులు తీరి ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలిగింది. రైతులు ధర్నా చేస్తున్నట్లు తెలియడంతో వాల్మీకిపురం ఎస్‌ఐ చంద్రశేఖర్ రైతుల వద్దకు చేరుకొని మార్కెట్‌లో జరుగుతున్న అక్రమాలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ మార్కెట్ యార్డులో జాక్‌పాట్ విధానంతో వ్యాపారులు దోచుకొంటున్నారని, అధికారులకు పలుమార్లు చెప్పినా పట్టించుకోవడం లేదని చెప్పారు. జాక్‌పాట్ విధానాన్ని ప్రశ్నించే రైతుల పట్ల వ్యాపారులు దురుసుగా ప్రవర్తిస్తున్నారని ఎస్‌ఐకు తెలిపారు. దీంతో రైతులు టమోటాకు ధరలున్న సమయంలో లక్షలాది రూపాయలు నష్టపోతునట్లు వివరించారు. అలాగే టమోటా పంటకు ధరలు లేని సమయంలో జాక్‌పాట్‌తో పెట్టుబడులు కూడా రాక రైతన్నలు అప్పుల పాలవుతున్నట్లు చెప్పారు. మార్కెట్‌యార్డులో జాక్‌పాట్ విధానాన్ని పూర్తి స్థాయిలో రద్దు చేయాలని, అప్పటి వరకు ధర్నాను విరమించేది లేదని వందలాది మంది రైతులు జాతీయ రహదారిపై కూర్చోని ధర్నా నిర్వహించారు.

ధర్నా చేస్తే కొనాలా..?

జాక్‌పాట్ విధానానికి వ్యతిరేకంగా రైతులు ధర్నా చేస్తే వ్యాపారులు టమోటాలు కొనాలా...అంటూ వ్యాపారులు అధికారులను హెచ్చరించారు. రైతులు ధర్నా చేస్తున్న సమయంలో మార్కెట్‌శాఖ కార్యదర్శి కుమార్‌రెడ్డి, వైస్ చైర్మన్ నౌషాద్ అలీలు వ్యాపారులతో మాట్లాడేందుకు వెళ్లారు. వ్యాపారులు జాక్‌పాట్ విధానాన్ని మానుకోవాలని అధికారులు సూచించడంతో రైతులు ధర్నా చేస్తే మండీల్లో టమోటాలు ఎలా కొంటామని...? రైతులు టమోటాలు ఎక్కడ అమ్ముకొంటారో చూస్తామంటూ అధికారులకు సవాల్ విసిరారు. దీంతో ఆగ్రహించిన రైతులు అధికారులు, కమిటీ సభ్యులను నిలదీశారు. మార్కెట్ యార్డు వ్యాపారుల సొంత జాగీరా...? అధికారుల నిర్లక్ష్యంతోనే వ్యాపారులు రెచ్చిపోతున్నారని... రైతులకు అన్యాయం చేసే వ్యాపారుల లైసెన్సులు రద్దు చేయాలంటూ నిలదీశారు. అనంతరం తహశీల్దార్ లక్ష్మీప్రసన్న, ఎస్‌ఐ చంద్రశేఖర్, కార్యదర్శి రైతులకు సర్దిచెప్పి సమస్యను పరిష్కరిస్తామని చెప్పడంతో శాంతించారు.

మార్కెట్ యార్డు వద్ద ఉద్రిక్తత

మార్కెట్ యార్డు వద్ద వందలాది మంది రైతులు జాతీయ రహదారిపై ధర్నా చేయడంతో కొంత సమయం ఉద్రిక్తత వాతావరణం నెలకొంది. రైతుల సమస్యలను పట్టించుకోవడం లేదని అధికారులు, పాలకవర్గ సభ్యులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. దీంతో రైతులకు పోలీసులకు మధ్య వాగ్వాదం చోటు చేసుకొంది. దీంతో కొంత సమయం ఉద్రిక్తత వాతావరణం నెలకొంది.

ఎంపీపీ రాజీనామా


సీఈఓకు రాజీనామా పత్రం అందజేస్తున్న ఎంపీపీ అనసూయమ్మ

తంబళ్లపల్లె, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): తంబళ్లపల్లె ఎంపీపీ అనసూయ నారాయణరెడ్డి సోమవారం తన పదవికి రాజీనామా చేశారు. వైసీపీ నాయకులతో కలిసి చిత్తూరులోని జడ్పీ సీఈవో రవికుమార్ నాయుడుకు తన రాజీనామా పత్రాన్ని సమర్పించారు. ఆమె మాట్లాడుతూ..విదేశాల్లో ఉన్న తమ పిల్లలను చూసేందుకు భర్త నారాయణరెడ్డితో కలిసి వెళ్తన్నామని సుమారు ఆరు, ఏడు నెలలు అక్కడే ఉంటామన్నారు. ఈ సమయంలో అభివృద్ధికి ఆటంకం కలుగకుండా వేరొకరిని నియమించాలని సీఈవోను కోరుతూ.. తన పదవికి రాజీనామా చేసినట్లు తెలిపారు.

బైక్ ప్రమాదంలో యువకుడు మృతి


మృతిచెందిన యువకుడు (ఫైల్)

మదనపల్లెఅర్బన్, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): బైక్ నడుపుతూ కింద పడిన ప్రమాదంలో యువకుడు మృతిచెందిన సంఘటన మదనపల్లె పట్టణంలో చోటు చేసుకుంది. సోమవారం మదనపల్లె పట్టణం, అమ్మచెరువుమిట్టకు చెందిన పవన్‌కుమార్, పల్లవి దంపతుల నీరుగట్టువారిపల్లెలోని మాయాబజార్‌లో సెల్‌షాపు నిర్వహిస్తున్నారు. వారి కుమారుడు అజయ్‌దేవా(19) ఫ్లిప్‌కార్ట్ పనులు చేస్తారు. ఇందులో భాగంగా మదనపల్లె టౌన్ నుంచి వెళుతుండగా అమ్మచెరువుమిట్ట వద్ద బైక్ స్కిడ్ అయి ప్రమాదం జరిగింది. ఇందులో యువకుడు అక్కడికక్కడే మృతి చెందాడు.

వృద్ధుడికి పాముకాటు


పాముకాటుతో చికిత్స పొందుతున్న వృద్ధుడు

మదనపల్లెఅర్బన్, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): పాముకాటుకు వృద్ధుడు గురైన సంఘటన నిమ్మనపల్లె మండలంలో చోటు చేసుకుంది. సోమవారం సాయంత్రం నిమ్మనపల్లె మండలం, గారబురుజు గొల్లపల్లెకు చెందిన వెంకటప్ప కుమారుడు గుర్రప్ప (50) మేకలను మేపుతుండగా పాముకాటుకు గురయ్యాడు. గమనించిన కుటుంబసభ్యులు వెంటనే మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి చికిత్సను అందించారు. ఈ మేరకు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ కోలుకొంటున్నాడు.

ఆర్టీసీ డ్రైవర్ నిర్వాకంతో ..

మహిళకు విరిగిన కాలు

ఓబులవారిపల్లె, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చిన్నఓరంపాడు క్రాస్ వద్ద ఆర్టీసీ బస్సు ఎక్కే క్రమంలో పొరపాటున మహిళ కింద పడి కాలుకు తీవ్ర గాయమై.. ఆసుపత్రిపాలైందని బాధితురాలి కుటుంబ సభ్యులు పోలీసులకు పిర్యాదు చేశారు. చిన్నఓరంపాడు గ్రామ పంచాయతీ కమ్మపల్లె హరిజనాడ గ్రామానికి చెందిన దాసరి అచ్చమ్మ గ్రామంలోని మరికొందరితో కలిసి రైల్వేకోడూరుకు వెళ్లే క్రమంలో బస్సు కోసం వేచి ఉండగా ఏపీ39యాజీ 8251 నంబరు గల బస్సు రావడం జరిగింది. అయితే బస్సులో ప్రయాణికులు ఎక్కువగా ఉండడంతో డ్రైవర్ స్టాప్‌లో కాకుండా మరికొంత దూరంలో నిలపడం జరిగింది. బస్సు వద్దకు వెళ్లిన అచ్చమ్మ బస్సు మెట్లు ఎక్కగా ఆమెతోపాటు వచ్చినవారు ఎక్కకపోవడంతో తిరిగి దిగే క్రమంలో బస్సు ముందుకు కదలడంతో దీంతో ఆమె కిందపడి ఎడమకాలు తీవ్ర గాయాలపాలైంది. ఇది గమనించిన ప్రయాణికులు కదులుతున్న బస్సును ఆపి డ్రైవర్, కండక్టర్‌లను మందలించడం జరిగింది. గాయపడిన బాధితురాలిని 108 ద్వారా రాజంపేట ప్రభుత్వాసుపత్రికి తరలించగా మెరుగైన వైద్యం కోసం వెళ్లాలని సూచించడంతో రైల్వేకోడూరులో ప్రైవేటు ఆసుపత్రిలో వైద్యం పొందుతుందని తమకు న్యాయం చేయాలని పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయడం జరిగింది. ప్రభుత్వం మహిళలకు స్త్రీ శక్తి పథకంద్వారా ఉచిత బస్సు పెట్టినప్పటి నుంచి బస్సు డ్రైవర్లు, కండక్టర్ల తీరు తీవ్ర అభ్యంతకరంగా ఉందని పలువురు ఆవేదన వ్యక్తం చేశారు.

ఎగువ చెన్నామర్రి సమీపంలో చిరుత

- కుక్కను చంపి...

కురబలకోట, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎర్రబల్లి పంచాయతీ ఎగువ చెన్నామర్రి గ్రామ సమీపంలో చిరుత సంచారం కలకలం రేపింది. ప్రముఖ పర్యాటక కేంద్రం హార్సిలీహిల్స్ అటవీ ప్రాంతంలో చిరుత సంచరిస్తున్నట్లు పలుమార్లు సంఘటనలు వెలుగు చూశాయి. కాగా హార్సిలీహిల్స్ అటవీ ప్రాంతం సమీపంలో రైతు నారాయణరెడ్డి తన పొలంలో ఆదివారం రాత్రి కుక్కను కాపలాగా పెట్టి ఇంటికి వచ్చేశాడు. సోమవారం ఉదయం పొలానికి వెళ్లిన రైతు కుక్క కళేబరాన్ని చూసి చుట్టుపక్కల ఉన్న రైతులను పిలిచాడు. చిరుత దాడిలోనే కుక్క చనిపోయిందని, అక్కడ చిరుత పాదముద్రలు ఉన్నాయని రైతులు తెలిపారు. వెంటనే వారు అటవీ శాఖాధికారులకు సమాచారం ఇచ్చారు. కొద్దిరోజుల క్రితం ఇదే ప్రాంతంలో రైతు రెడ్డిశేఖర్‌రెడ్డికి చెందిన కుక్కను కూడా చిరుత లాక్కెళ్లిన ఘటన జరిగింది. ఈ ప్రాంతంలో చిరుత సంచారంతో ప్రజలు భయాందోళన చెందుతున్నారు.

సైనిక్ స్కూల్ ప్రవేశాలకు నోటిఫికేషన్ జారీ

- దరఖాస్తులకు ఈ నెల 30 చివరి తేది


కలికిరి సైనిక్ స్కూల్

కలికిరి, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): కలికిరి సైనిక్ స్కూల్‌లో 2026-27 విద్యా సంవత్సరానికి ప్రవేశాల కోసం జాతీయ స్థాయిలో నిర్వహించే అర్హత పరీక్షకు దరఖాస్తులు పంపుకోవడానికి నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ నోటిఫికేషన్ జారీ చేసింది. కలికిరితో పాటు విజయనగరం జిల్లా కోరుకొండ సైనిక్ స్కూల్ ప్రవేశాలకు కూడా దరఖాస్తులు పంపుకోవచ్చు. ఇవి రెండూ కాకుండా అదానీ వరల్డ్ స్కూల్ (నెల్లూరు), నేతాజీ సైనిక్ స్కూల్ (కృష్ణా), వెరిటాస్ సైనిక్ స్కూల్ (తిరుపతి) ఈ మూడు ప్రైవేట్ (అప్రూవ్డ్) సైనిక్ స్కూళ్లలో ప్రవేశాలకు కూడా అవకాశం కల్పించారు. ఆరు, తొమ్మిది తరగతుల్లో మాత్రమే కొత్తగా ప్రవేశాలుంటాయి. ఈ నెల 30వ తేదీ లోగా దరఖాస్తులు పంపుకోవాల్సి వుంటుంది. జనవరిలో ఎన్టీఏ ఆధ్వర్యంలో ప్రవేశ పరీక్షలు నిర్వహిస్తారు. కేంద్రాలు, పాఠశాల వారీగా అందుబాటులో వున్న సీట్ల వివరాలను ఎన్టీఏ నోటిఫై చేసింది. సాధారణంగా అక్టోబరులో దరఖాస్తులను ఆహ్వానించడం, జనవరిలో అర్హత పరీక్షలు నిర్వహణ, అనంతరం మార్చి, ఏప్రిల్ నెలల్లో ఇంటర్వ్యూలు లాంటి ఆనవాయితీలుండగా గతేడాది రెండు నెలలు ఆలస్యంగా ప్రక్రియ కొనసాగింది. అయితే ఈ ఏడాది తిరిగి ఆనవాయితీ ప్రకారమే షెడ్యూలు ప్రకటించారు. ఈ నెల 30న ఆన్‌లైన్‌లో దరఖాస్తులు సమర్పించిన అనంతరం అందులో ఏవైనా మార్పులు, చేర్పులుంటే సరిదిద్దుకోవడానికి 31న అవకాశం కల్పించారు. ఆ తరువాత వెబ్‌సైట్‌లో హాల్‌టికెట్లు జారీ చేస్తారు. వివరాలేవైనా అవసరమైతే పనివేళల్లో సంప్రదించడానికి ఎన్టీఏ హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేసింది. 011-40759000, 011-69227700 నంబర్లను సంప్రదించవచ్చు.

అర్హతలు

ఆరవ తరగతి ప్రవేశాలకు 2026 మార్చి 31 నాటికి 10 నుంచి 12 ఏళ్ల వయసుండాలి. అంటే 2014 ఏప్రిల్ 1 నుంచి 2016 మార్చి 31 మధ్య జన్మించి వుండాలి. తొమ్మిదవ తరగతి ప్రవేశాలకు 13-15 ఏళ్ల మధ్య వయసుండాలి. అంటే 201 ఏప్రిల్ 1 నుంచి 2013 మార్చి 31 మధ్య జన్మించి వుండాలి. దరఖాస్తు రుసుం జనరల్, డిఫెన్స్ కేటగిరీ విద్యార్థులకు రూ.850, ఎస్సీ, ఎస్టీలకు రూ.700 వంతున చెల్లించాలి. ఆరవ తరగతికి మధ్యాహ్నం 2 నుంచి 4.30 గంటల వరకు, తొమ్మిదవ తరగతికి 5 గంటల వరకు పరీక్షలు నిర్వహిస్తారు.

అందుబాటులో వుండే సీట్లు

కలికిరి సైనిక్ స్కూల్‌లో ఆరవ తరగతిలో మొత్తం 105 సీట్లున్నాయి. అందులో స్థానికత కింద (ఏపీ విద్యార్థులకు) బాలురుకు 66, బాలికలకు ఐదు సీట్లు, మిగిలినవి ఇతర రాష్ట్రాల వారికి కేటాయించారు. కోరుకొండలో మొత్తం 90 సీట్లుండగా స్థానికత కింద 60, ఇతరులకు 30 సీట్లు కేటాయించారు. తొమ్మిదవ తరగతిలో కలికిరిలో 10 సీట్లుండగా అందులో రెండు మాత్రం ఇతర రాష్ట్రాలకు కేటాయించారు. కోరుకొండలో 23 సీట్లుండగా అందులో 7 సీట్లు ఇతర రాష్ట్రాలకు కేటాయించారు. ఇక ప్రైవేట్ అప్రూవ్డ్ స్కూళ్లలో అదాని వరల్డ్ స్కూల్‌లో మొత్తం 80 సీట్లు, నేతాజీలో బాలురుకు మాత్రమే 120 సీట్లున్నాయి. ఇక తిరుపతి వెరిటాస్‌లో 150 సీట్లుండగా అదానిలో మాత్రమే 9వ తరగతిలో 30 సీట్లున్నాయి.

అర్జీలు పరిష్కరించడమే మా పనా...!

- ఎన్నిసార్లు తిరుగుతావంటూ అర్జీదారుడిపై డీటీ ఆగ్రహం


సబ్ కలెక్టరేట్ పీజీఆర్ఎస్ హాల్లో అర్జీదారుడు అజీజ్‌తో మాట్లాడుతున్న డీటీ శాంతమ్మ

మదనపల్లె టౌన్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం పీజీఆర్ఎస్ కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తోంది. పీజీఆర్ఎస్‌లో ప్రజల నుంచి వచ్చే అర్జీలకు ప్రాధాన్యత ఇచ్చి పరిష్కారం చూపాలని స్వయంగా సీఎం చంద్రబాబు కలెక్టర్లను ఆదేశించిన విషయం తెలిసిందే. కానీ మదనపల్లె సబ్‌కలెక్టరేట్‌లో మాత్రం ఓ డీటీ అర్జీదారుడిపై అందరి ముందే ఆగ్రహం వ్యక్తం చేసింది. అర్జీలు పరిష్కరించడమే మా పనా..? ఎన్నిసార్లు తిరుగుతావంటూ పీజీఆర్ఎస్ హాల్లోనే అందరి ముందు అర్జీదారున్ని నిలదీసింది. వివరాల్లో వెళితే.. సోమవారం మదనపల్లె సబ్‌కలెక్టరేట్‌లో డీఏవో నిర్మలదేవి ఆధ్వర్యంలో పీజీఆర్ఎస్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా చిత్తూరు జిల్లా వి.కోట మండలం తోటకనుమకు చెందిన అజీజ్‌సాహెబ్ మాట్లాడుతూ కుప్పం బ్రాంచ్ కెనాల్ కోసం తమ భూమిని తీసుకున్న ప్రభుత్వం ఇంత వరకు నష్టపరిహారం ఇవ్వలేదన్నారు. దీనిపై మూడు నెలల నుంచి తిరుగుతున్నా తమ పైలు కదలలేదని ఫిర్యాదు చేశారు. దీనిపై హెచ్ఎన్ఎస్ఎస్ డీటీ శాంతమ్మ వచ్చి మాట్లాడుతూ తమకు పనిభారం ఎక్కువగా ఉందని, అర్జీలు చూడటమే తమ పనా అంటూ, ఎన్నిసార్లు తిరుగుతావంటూ అర్జీదారున్ని ప్రశ్నించింది. దీంతో అవాక్కయిన అర్జీదారుడు మీడియాతో తనగోడు వెళ్లబోసుకున్నాడు. ఈ విషయమై డీఏవో నిర్మలదేవి మాట్లాడుతూ అర్జీదారులతో మర్యాదపూర్వకంగా మాట్లాడాలని, అజీజ్ పైలు తొందరగా పూర్తి చేసి ఇవ్వాలని డీటీ శాంతమ్మకు సూచించారు. కురబలకోట మండలానికి చెందిన పగడాల గోపాలకృష్ణ భూమికి సంబంధించి మ్యుటేషన్ చేయడానికి సబ్‌కలెక్టరేట్‌లోని ఓ క్లర్కు తిప్పుకుంటూనే ఉన్నాడని బాధితుడు డీఏవోకు ఫిర్యాదు చేశాడు. చేనేత కార్మికులకు ప్రభుత్వం మంజూరు చేసిన ఉచిత విద్యుత్ పథకాన్ని ఇంత వరకు అమలు చేయలేదని చేనేత కార్మికులు అర్జీ అందజేశారు. మదనపల్లె ఎంపీడీవో వైసీపీ సర్పంచ్‌లను వేధిస్తున్నాడని వైసీపీ నాయకులు డీఏవోకు ఫిర్యాదు చేశారు. వీటితో పాటు 52 మంది వివిధ సమస్యలతో డీఏవోకు అర్జీలు అందజేశారు.

అలసత్వం చేయొద్దు

- అదనపు ఎస్పీ వెంకటాద్రి


ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న అదనపు ఎస్పీ వెంకటాద్రి

రాయచోటిటౌన్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): ప్రజల సమస్యలను తక్షణమే పరిష్కరించడం లో అధికారులు ఏమాత్రం అలసత్వం చేయొ ద్దని, చట్ట పరిధిలో బాధితులకు సత్వర న్యాయం అందించాలని అదనపు ఎస్పీ ఎం.వెంకటాద్రి జిల్లాలోని పోలీసు అధికారులను ఆదేశించారు. ఎస్పీ ధీరజ్ కునుబిల్లి ఆదేశాల మేరకు సోమవారం జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి నలుమూలల నుంచి వచ్చిన ఫిర్యాదుదారులతో అదనపు ఎస్పీ నేరుగా మాట్లాడి వారి సమస్యలను శ్రద్ధగా తిలకించి అర్జీలను క్షుణ్ణంగా పరిశీలించారు. సదరు అర్జీలపై సంబంధిత పోలీసు అధికారులతో ఫోన్‌లో మాట్లాడి తక్షణమే విచారణ జరిపి చట్టపరిధిలో సత్వర న్యాయం అందించాలని ఆదేశించారు. అలాగే తీసుకున్న చర్యలకు సంబంధించిన నివేదికలను వెంటనే జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయానికి పంపాలని అధికారులను ఆదేశించారు. అంతేగాక దివ్యాంగులు, వృద్ధులు, మహిళల ఫిర్యాదులకు మొదట ప్రాధాన్యత ఇచ్చి వేగంగా సమగ్ర విచారణ జరిపి సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. జిల్లా కేంద్రానికి రాలేని బాధితులు వారి దగ్గరలోని పోలీసుస్టేషన్లు, సర్కిల్ కార్యాలయాలు, సబ్ డివిజన్ కార్యాలయాల్లో కూడా ఫిర్యాదు చేయవచ్చని సూచించారు.

విద్యార్థి మృతదేహం లభ్యం

మదనపల్లెఅర్బన్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని వడ్డిపల్లె సమీపంలో గల హంద్రీనీవా కాలువలో ఆదివారం గల్లంతైన విద్యార్థి సాయికిరణ్ మృతదేహాన్ని సోమవారం ఫైర్ సిబ్బంది బయటకు తీశారు. మృతుడి తల్లిదండ్రులు సురేశ్, సరళలు మాట్లాడుతూ ఆదివారం కూడా క్లాసులు నడపడంతోనే తమ అబ్బాయి మృత్యువాత పడ్డారని ఆరోపించారు. వెంటనే మదనపల్లె వన్‌టౌన్ పోలీసులు సంఘటన స్థలంలోకి వెళ్లి మృతదేహాన్ని పరిశీలించి మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి మార్చురీకి తరలించారు. ఈ మేరకు సీఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.


హంద్రీ నీవా కాలువలో పడి మృతి చెందిన విద్యార్థి సాయికిరణ్

నిందితుడికి 20 ఏళ్ల జైలుశిక్ష

- చిత్తూరు పోక్సో కోర్టులో తీర్పు


నిందితుడు ప్రసాద్ (ఫైల్ పొటో)

మదనపల్లెఅర్బన్, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): చిన్నారి విషయంలో నిందితుడికి 20 ఏళ్ల జైలుశిక్ష అమలు చేసినట్లు చిత్తూరు పోక్సో కోర్టు సామవారం తీర్పు ఇచ్చింది. వివరాల్లోకెళ్తే.. మదనపల్లెలో చిన్నారిపై 2021 మార్చి 3న బసినికొండ గ్రామానికి చెందిన పి.ప్రసాద్ (23)అనే యువకుడు ఓ బాలికకు మాయమాటలు చెప్పి కిడ్నాప్ చేసి అత్యాచారం చేశాడు. బాధితురాలు తల్లి మార్చి 5న మదనపల్లె తాలుకా పోలీసుస్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేసింది. అప్పట్లో కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు. నిందితుడు ప్రసాద్ చేసిన నేరం రుజువు కావడంతో చిత్తూరు జిల్లా పోక్సో కోర్టు తీర్పు ఇచ్చింది. 20 ఏళ్ల జైలుశిక్షతో పాటు రూ.8వేలు జరిమానా విధించింది. తీర్పు వెలువడగానే బాధితురాలి కుటుంబసభ్యులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కేసులో విచారణాధికారి రవిమనోహరాచారి, అప్పటి మదనపల్లె డీఎస్పీ కేసు నమోదు చేసిన అధికారి ఎస్‌ఐ దిలీప్‌కుమార్, ప్రస్తుత మదనపల్లె డీఎస్పీ మహేంద్ర, తాలుకా సీఐ కళా వెంకటరమణ, కోర్టు కానిస్టేబుల్ వెంకటరమణ, తదితరులు పాల్గొన్నారు.

బాలికలను వివక్షతతో చూడకూడదు

- జిల్లా విస్తృత ఆరోగ్య విద్యాధికారి దేవశిరోమణి

రాయచోటిటౌన్, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): బాలికలను వివక్షతతో చూడకూడదని మగ పిల్లలతో సమానంగా చూసుకోవాలని జిల్లా విస్తృత ఆరోగ్య విద్యాధికారి (డెమో) దేవశిరోమణి పేర్కొన్నారు. అంతర్జాతీయ బాలికల దినోత్సవం సందర్భంగా సోమవారం రాయచోటి మండల పరిధిలోని కస్తూర్బాగాంధీ బాలికల పాఠశాలలో వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో బాలికలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ సమాజంలో ఆడపిల్లలపై ఉన్న అసమానత్వం, చిన్నచూపు, లింగ వివక్షత సమూల నిర్మూలనకు ప్రతిఒక్కరూ కృషి చేయాలన్నారు. అనంతరం డిప్యూటీ హెచ్ఈవో కె.బలరామరాజు మాట్లాడుతూ సమాజంలో ఆడ, మగ ఇరువురు సమానమేనని, లింగ నిర్ధారణ చేసినట్లు తెలిస్తే చట్టరీత్యా కఠిన శిక్షలు, జరిమానా విధించబడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో గర్ల్‌చైల్డ్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ సుమతి, జిల్లా చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్ వినోద్, హెచ్ఈ రాజగోపాల్, సీహెచ్‌వో రామకృష్ణ యాదవ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

తైక్వాండో పోటీల్లో బంగారు పతకం



రైల్వేకోడూరు, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్థాయి తైక్వాండో పోటీలు బాపట్ల జిల్లాలోని పేటూరులో 69వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 10, 11, 12 తేదీల్లో నిర్వహించారు. ఈ పోటీల్లో రైల్వేకోడూరుకు చెందిన విద్యార్థిని టి.సోహిత అండర్-14, 38 ప్లస్ విభాగంలో తన ప్రతిభను ప్రదర్శించి బంగారు పతకాన్ని సాధించినట్లు ఎస్‌కే స్పోర్ట్స్ అకాడమి కోచ్ ఎస్‌కే మౌలా సోమవారం తెలిపారు. నవంబర్ నెలలో నిర్వహించే జాతీయ స్థాయి పోటీలకు సోహిత ఎంపిక అయినట్లు తెలిపారు.

ప్రేమ వేధింపులతో బాలిక మృతి

- పూలికుంటలో దారుణం

గాలివీడు, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): మండలంలోని పూలికుంట పంచాయతీ గుంటికాడపల్లికు చెందిన బాలిక (14) ప్రేమ వేధింపులతో ఆత్మహత్య చేసుకున్న దారుణ సంఘటన చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. అదే గ్రామానికి చెందిన ఓ వ్యక్తి తరచూ 'నేను నిన్ను ప్రేమిస్తున్నాను.. నాతో మాట్లాడాలి' అంటూ వేధింపులకు గురి చేసేవాడు. దీంతో మనస్థాపానికి గురైన బాలిక అక్టోబరు 9న తమ పొలం కోసం ఉంచిన గడ్డి మందును సేవించింది. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఆమె ఆరోగ్యం విషమించడంతో అక్టోబరు 13వ తేదీ తిరుపతి స్విమ్స్ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ అర్ధరాత్రి మృతి చెందింది. ఈ ఘటనపై గాలివీడు పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్‌ఐ రామకృష్ణ తెలిపారు.

శ్రమదాన స్ఫూర్తి.. సిమెంటు రోడ్డు పూర్తి

- నిన్నటివరకు మోకాళ్లలోతు నీరు
- నేడు సిమెంటు రోడ్డుతో సమస్య పరిష్కారం
- మందరం రాచపల్లెలో స్వయంగా రోడ్డు వేసుకున్న గ్రామస్థులు

రాజంపేట, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): అనేక అభివృద్ధి కార్యక్రమాల్లో ఆదర్శంగా ఉండే మందరం రాచపల్లె గ్రామస్థులు స్వయంగా శ్రమదానం చేసి సిమెంటు రోడ్డు వేసుకుని ఇతరులకు ఆదర్శప్రాయంగా నిలిచారు. రాజంపేట-చిట్వేలి రోడ్డు మార్గంలో ప్రధాన రహదారి పక్కన మందరం పల్లె రాచపల్లె గ్రామం ఉంది. ఆ గ్రామంలో సుమారు 70 గృహాలు ఉన్నాయి. అయితే గత పదేళ్లుగా గ్రామంలో మురికినీటి సమస్య ఇబ్బందికరం చేస్తోంది. గ్రామంలో గతంలో సిమెంటు రోడ్డు వేసుకున్నా రోడ్డు గుంతలుగా మారడంతో వర్షపు నీరంతా గ్రామ రహదారిలో చేరి మురికి మయంగా మారింది. అటు పోవాలన్నా ఇటు రావాలన్నా గ్రామవీధిలో నిలబడ్డ మురికినీటితో చాలా ఇబ్బందులు పడేవారు. గ్రామ రోడ్డుకు గత వైసీపీ ప్రభుత్వం మొండిచేయి చూపింది. ఈ సమయంలో ఆ గ్రామానికి చెందిన నాయకుడు సంపతి ఉమాపతి ఆధ్వర్యంలో శ్రమదానం చేసి సిమెంటు రోడ్డు వేశారు. ప్రస్తుతం ఉమాపతి తమిళనాడు రాష్ట్రం ఓసూరులో ఉపాధ్యాయునిగా పనిచేస్తున్నారు. గ్రామ సమస్యను గుర్తించి ఇటీవల దసరా సెలవులు కావడంతో తోటి గ్రామస్థులు, బంధువులతో కలిసి దాతలు పులిగోరి చంద్రారెడ్డి తదితరుల సహకారంతో సిమెంటు పోగు చేశారు. తానే స్వయంగా ఇసుక, కంకర తదితర ఖర్చులు పెట్టుకుని గ్రామస్థుల సహకారంతో వారికి వారే మేస్త్రిని పెట్టుకుని సుమారు వంద మీటర్ల మేర నీరు నిలిచే ప్రాంతాన్ని ఎత్తుగా లేపి సిమెంటు రోడ్డు వేశారు. దీంతో గ్రామంలో మురికినీటి సమస్య పదేళ్ల తర్వాత తీరింది. ఈ సందర్భంగా సంపతి ఉమాపతి మాట్లాడుతూ గతంలో తాము శ్రమదానం ద్వారా అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేశామని, ప్రస్తుతం సిమెంటు రోడ్డు కూడా అదే స్ఫూర్తితో వేసినట్లు తెలిపారు. గతంలో సీఎం చంద్రబాబు ఇచ్చిన స్ఫూర్తితో గ్రామంలో బస్సుషెల్టర్, రోడ్లు, బడి, గుడి ఇతర అభివృద్ధి కార్యక్రమాలను చేశామని తెలిపారు.


నిన్న గ్రామం నట్టనడిరోడ్డులో నిలిచి ఉన్న మురుగునీరు


నేడు శ్రమదానంతో పూర్తి అయిన సిమెంట్ రోడ్డు

ఆ రోడ్లపై ప్రయాణం.. నరకం!

- ప్రొద్దుటూరు పట్టణంలో పలు ప్రధాన రోడ్లపై గుంతలు
- మైదుకూరు రోడ్డు, ఎర్రగుంట్ల బైపాస్ రోడ్డులో..
- మరమ్మతులు కూడా చేపట్టని వైనం
- పట్టించుకోని అధికారులు, ప్రజా ప్రతినిధులు

ప్రొద్దుటూరు , అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): ప్రొద్దుటూరు పట్టణంలోని పలు ప్రధాన రోడ్లపై గుంతలు పడి ప్రయాణికులకు నరకాన్ని చూపుతున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యారు. ఇక ద్విచక్ర వాహనదారులు, ఆటోల పరిస్థితి అధ్వానంగా తయారైంది. ప్రొద్దుటూరు పట్టణంలోని మైదుకూరు రోడ్డు దారుణంగా ఉంది. నిత్యం వేలాదిగా వాహనాలు ఆ రోడ్డుపై ప్రయాణిస్తుంటాయి. గత కొన్నేళ్లుగా మైదుకూరు రోడ్డు విస్తరణకు నోచుకోక దుర్భంగా మారింది. దీనికి తోడు రోడ్డుకు ఇరువైపులా కాలువలు లేక వర్షాలు వస్తే రోడ్లపై వర్షపు నీరు నిలిచి చెరువును తలపిస్తుంటాయి. ఇటీవల కొత్తపల్లె పంచాయతీ అధికారులు మైదుకూరు రోడ్డుకు ఒకవైపు మాత్రమే కాలువ నిర్మాణ పనులు చేపట్టారు. అదికూడా పూర్తి స్థాయిలో నిర్మాణం కాక అక్కడక్కడ కాలువ పెండింగ్‌లో ఉండటం వలన రోడ్డుపైకి కాలువలోని మురుగు నీరంతా ప్రవహిస్తోంది. దీంతో ప్రయాణికులకు తీవ్ర అసౌకర్యంగా ఉంటోంది. ఇక





ఎర్రగుంట్ల బైపాస్ రోడ్డులో పడిన గుంతలు



మైదుకూరు రోడ్డులోని హోండా షోరూం వద్ద ఏర్పడిన గుంత

ఆర్టీసీ బస్టాండ్ నుంచి కొత్తపల్లె బైపాస్ సర్కిల్ వరకు గుంతలతో దారుణంగా తయారై.. తరుచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. కానీ ఆర్‌అండ్‌బీ, పంచాయతీ అధికారులు కొన్ని గుంతలలో రాళ్లు పోసి పూడ్చే ప్రయత్నం చేశారు తప్ప రోడ్డుకు ప్యాచింగ్ పనులు కూడా చేపట్టలేదు. మైదుకూరు రోడ్డు నుంచి ఎర్రగుంట్ల బైపాస్ రోడ్డు వెళ్లే మార్గం గుంతలమయమై దుర్భరంగా ఉంది. ఎర్రగుంట్ల బైపాస్ రోడ్డు విస్తరణకు నిధులు విడుదలైనా విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌పార్మర్స్ షిఫ్టింగ్ పనులు ఏడాది కాలం పైగా ఆగిపోయాయి. పొట్టిపాడు రోడ్డు చిన్నశెట్టి పల్లె రోడ్లలో గుంతలకు ప్యాచింగ్‌లు కూడా వేయకపోవడంతో ఆ రోడ్లపై ప్రయాణం అంటే నరకాన్ని తలపిస్తోందని పట్టణ ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అధికారులు ఏమన్నారంటే: రోడ్లపై పడిన గుంతల విషయమై ఆర్‌అండ్‌బీ అధికారులను వివరణ కోరగా గుంతలు పూడ్చడనికి ప్రభుత్వం నిధులు విడుదల చేసిందని, త్వరలో టెండర్లు పిలిచి రోడ్లపై ప్యాచింగ్ పనులు పూర్తి చేస్తామన్నారు.

చట్టపరిధిలో న్యాయం చేయండి

- అదనపు ఎస్పీ (అడ్మిన్) కె.ప్రకాశ్‌బాబు

కడప క్రైం, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదికకు వచ్చిన ఫిర్యాదుదారులకు చట్టపరిధిలో న్యాయం చేయాలని అదనపు ఎస్పీ (అడ్మిన్) కె.ప్రకాశ్‌బాబు పోలీసు అధికారులను ఆదేశించారు. జిల్లా పోలీసు కార్యాలయంలోని పెన్నార్ పోలీసు కాన్ఫరెన్స్ హాలులో జిల్లా ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్ ఆదేశాల మేరకు అదనపు ఎస్పీ (అడ్మిన్) కె.ప్రకాశ్‌బాబు సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కారవేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు.

జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలతో అదనపు ఎస్పీ మాట్లా డి ఫిర్యాదులపై చట్టపరంగా చర్యలు తీసుకునేలా సంబంధిత పోలీసు అధి కారులకు ఆదేశాలు జారీ చేశారు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన ఫిర్యా దుదారులకు పోలీసు సిబ్బంది ప్రశాంతంగా తమ సమస్యను వివరించ డానికి సహాయం చేశారు. కార్యక్రమంలో స్పెషల్‌బ్రాంచ్ డీఎస్పీ ఎస్.సుధా కర్ పాల్గొన్నారు.

అనుమానాస్పద మృతి కాదు.. హత్యే

- కుమారుని మృతిపై తండ్రి ఫిర్యాదు
- విచారణకు ఎస్పీ ఆదేశం ● హత్యగా తేల్చిన వైనం

పెండ్లిమర్రి, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): పెండ్లిమర్రి పోలీసు స్టేషన్ పరిధిలో అనుమానాస్పద మృతిగా నమోదైన కేసును హత్యగా తేల్చారు. స్థానిక పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి చేతులు దులుపుకునేందుకు ప్రయత్నించగా ఎస్పీ నచికేత్ విశ్వనాథ్ ప్రత్యేకంగా విచారణ చేయించడంతో సైనైడ్ మర్డర్‌గా తేలింది. చివరికి ఇద్దరు నిందితులను అరెస్టు చేసి రిమాండుకు పంపించారు. ఇందుకు సంబంధించిన వివరాలిలా.. పెండ్లిమర్రి మండలం ఎం.చౌటుపల్లెకు చెందిన సుబ్బయ్య (46) ఈ ఏడాది మార్చి 29న రాత్రి 9గంటల ప్రాంతంలో మృతి చెందాడు. అప్పట్లో అనుమానాస్పద మృతిగా పోలీసులు కేసు నమోదు చేశారు. కనీసం అనుమానాస్పదంగా ఎలా మృతి చెందాడో కూడా పోలీసులు తేల్చలేదు. దీంతో తన కుమారుడిది అను మానాస్పద మృతి కాదని హత్య అని భావించిన మృతుడి తండ్రి పీజీఆర్ఎస్‌లో ఎస్పీ నచికేత్ విశ్వనాథ్‌కు ఫిర్యాదు చేశారు. కుమారుడి మృతిపై అనుమానం వ్యక్తం చేస్తూ ఫిర్యాదులో పేర్కొన్నారు. దీంతో ఎస్పీ ఓ డీఎస్పీ ద్వారా విచారణ చేయించారు. అయితే ఇది అనుమానాస్పద మృతి కాదని, సైనేడ్ కలిపి హత్య చేశారని నిర్ధారించారు. ఎస్పీ ఆదేశాల మేరకు పెండ్లిమర్రి సీఐ చల్లని దొర విచారణ చేయించి నిందితులను అరెస్టు చేశారు. చౌటుపల్లెకు చెందిన మృతుడు సుబ్బయ్య అదే గ్రామానికి చెందిన బాల అంకిరెడ్డి సతీమణిని వేధించేవాడు. దీంతో ఎలాగైనా సుబ్బయ్యను మట్టుబెట్టాలని నిర్ణయించాడు. ఆరవేటి మాచనూరు గంగిరెడ్డి సూచనల మేరకు మద్యంలో సైనెడ్ కలిపి చంపాలని నిర్ణయించుకున్నారు. ఈ నేపథ్యంలో మార్చి 29న బాల అంకిరెడ్డి మరి కొందరు మద్యం తాగుతుండగా ఆ సమయానికి సుబ్బయ్య అక్కడికి వచ్చారు. తనకు మద్యం కావాలని అడగ్గా సైనెడ్ కలిపిన మద్యాన్ని ఇచ్చారు. అది తాగి సుబ్బయ్య అక్కడికక్కడే మృతి చెందారు. విచారణలో అంకిరెడ్డిని, గంగిరెడ్డిని పోలీసులు అరెస్టు చేసి జైలుకు పంపించారు.

రైలుకింద పడి గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్య

ప్రొద్దుటూరు, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): ప్రొద్దుటూరు రైల్వే స్టేషన్ పరిధిలో పెన్నానది బ్రిడ్జి వద్ద రైల్వే ట్రాక్‌పై గుర్తు తెలియని వ్యక్తి రైలుకింద పడి ఆత్మహత్య చేసుకున్న సంఘటన చోటు చేసుకుంది. సోమవారం ఉదయం 8.30 గంటల సమయంలో నంద్యాల-రేణిగుంట్ల డెమో రైలుకింద పడి మరణించాడు. అతని వయస్సు 50 సంవత్సరాలు ఉంటుందని చెబుతున్నారు. రైలు కమ్మీమీద తల పెట్టి పడుకోవడంతో తల మొండెంతో వేరైంది. తల కూడా గుర్తు పట్టని తీరులో ఎగిరి పడింది. అతను చొక్కా లుంగీ ధరించి ఉన్నాడని, ఎరుపు తెలుపు గల్ల రంగు టవల్‌తో పడి వున్నాడని రైల్వే పోలీసులు తెలిపారు. అతని ఆచూకీ తెలిసిన వారు ఎర్రగుంట్ల రైల్వేస్టేషన్ హౌస్ ఆఫీసర్ 9700675792 నెంబరుకు ఫోన్ చేయాలని కోరారు.

ప్రియురాలు పెళ్లికి ఒప్పుకోలేదని...

- కత్తితో కోసుకున్న ప్రియుడు

పులివెందుల, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): పెళ్లి చేసుకునేందుకు ప్రియురాలు ఒప్పుకోలేదని ఓ ప్రేమికుడు కత్తితో తన ఒంటిపై పలు చోట్ల కోసుకున్నాడు. విషయం తెలుసుకున్న బంధువులు ఆసుపత్రికి తరలించారు. వివరాల్లోకెళితే.... పులివెందులలోని ప్రైవేటు డిగ్రీ కళాశాలలో ఓ విద్యార్థిని హాస్టల్‌లో ఉంటూ మొదటి సంవత్సరం చదువుకుంటోంది. మరో కళాశాలలో డిగ్రీ చదువుకుంటున్న విద్యార్థి ఇరువురు కొన్నిరోజులుగా ప్రేమించుకుంటున్నారు. సోమవారం రాజారెడ్డి పార్క్ సమీపంలో ఉన్న హాస్టల్ వద్దకు వచ్చి ప్రియురాలిని పిలిచాడు. కానీ ఆ ప్రియురాలు బయటకు రాలేదు. దీంతో ఆమె బంధువు సోదరి అయిన మహిళ వచ్చి ఆ విద్యార్థిని రాజారెడ్డిపార్క్ వద్దకు పిలుచు కెళ్లింది. ఇరువురిని పెళ్లికి ఒప్పించేందుకు ప్రయత్నించినట్లు తెలిసింది. కానీ ఆ విద్యార్థిని పెళ్లికి ఒప్పుకోకుండా తిరిగి హాస్టల్‌కు వెళ్లిపోయింది. దీంతో ప్రేయసికోసం ఒంటిపై పలుచోట్ల కోసుకున్నాడు. రక్తగాయాలతో వెళ్లిన అతన్ని చూసి చూసిన చుట్టుపక్కలవారు, స్నేహితులు కలిసి ఆసుపత్రికి తరలించారు. ఈ విషయాన్ని హాస్టల్ వార్డన్‌ను ఆంధ్రజ్యోతి వివరణ కోరగా.. జరిగిన సంఘటన గురించి విద్యార్థిని తల్లిదండ్రులకు సమాచారం ఇవ్వడంతో హాస్టల్ వద్దని లెటర్ రాసి ఆ విద్యార్థినిని ఇంటికి తీసుకెళ్లినట్లు వార్డన్ పేర్కొంది.

చోరీ కేసులో దొంగ అరెస్టు

జమ్మలమడుగు, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగు మున్సిపాలిటీ పరిధిలోని కాపు వీధిలో నివశిస్తున్న బ్యాంకు ఉద్యోగి బండి మనోహర్ ఇంటిలో ఈ నెల 1వ తేదీ చోరీ జరిగింది. బాధితుడు అర్బన్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు విచారణ చేసి సోమవారం గూడెంచెరువుకు చెందిన మెరుగు బాబు అనే యువకుడిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ రామకృష్ణ తెలిపారు. అతని వద్ద నుంచి ఒక బంగారు చెయిన్, చిన్న ఉంగరం స్వాధీనం చేసుకున్నామని ఎస్ఐ తెలిపారు.

అనుమతి లేకుండా ఆసుపత్రి నిర్వహిస్తున్న వ్యక్తి అరెస్టు

వేంపల్లె, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): వేంపల్లె పట్టణం కడప రోడ్డులో అనుమతి లేకుండా ఆసుపత్రి నిర్వహిస్తున్న విజయ్‌కుమార్‌ను అరెస్టు చేసినట్లు సీఐ నరసింహులు తెలిపారు. నిబంధనలకు విరుద్ధంగా ఆసుపత్రిలో ఆపరేషన్లు నిర్వహిస్తున్నట్లు అతనిపై ఫిర్యాదు రావడంతో డీఎస్పీ మురళి నాయక్ ఆదేశాలతో విజయ్‌కుమార్‌ను అరెస్టు చేసి, నాన్‌బెయిలబుల్ కేసు నమోదు చేశామన్నారు.

గ్రామ పంచాయతీ అభివృద్ధిలో సెక్రటరీలదే కీలక పాత్ర

- డీపీవో రాజ్యలక్ష్మి

కడప రూరల్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీ అభివృద్ధిలో సెక్రటరీలదే కీలక పాత్ర అని పంచాయతీశాఖ జిల్లా అధికారి (డీపీవో) రాజ్యలక్ష్మి పేర్కొన్నారు. సోమవారం జడ్పీ ఆవరణలోని డీపీఆర్‌సీ భవనంలో గ్రామ పంచాయతీ సొంత ఆదాయ వనరుల సృష్టి అనే అంశంపై పంచాయతీ సెక్రటరీలకు శిక్షణను నిర్వహించారు. ఈ సందర్భంగా డీపీవో మాట్లాడుతూ పంచాయతీ సెక్రటరీలు పంచాయతీ పరిధిలోని వనరుల ద్వారా ఆదాయాన్ని సమకూర్చుకొని తద్వారా పంచాయతీల అభివృద్ధికి తోడ్పాటును అందించాలన్నారు. గ్రామ పంచాయతీలోని ప్రతి గ్రామాన్ని స్వచ్ఛ గ్రామంగా తీర్చిదిద్ది తద్వారా స్వచ్ఛాంధ్రప్రదేశ్ దిశగా అడుగులు వేయాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పల్లె సీమల ప్రగతికి పెద్ద పీట వేస్తున్నాయన్నారు. అనంతరం గ్రామ పంచాయతీలో ఏఏ వనరులు ఉన్నాయి, వాటి ద్వారా ఆదాయాన్ని ఎలా సృష్టించుకోవాలి, సమకూరిన నిధులతో ప్రజలకు అవసరమైన అభివృద్ధి కార్యక్రమాలను ఎలా చేపట్టాలన్న అంశాలను తెలియపరిచారు. కార్యక్రమంలో డీపీఆర్‌సీ జిల్లా కో-ఆర్డినేటర్ రమణారెడ్డి, ట్రైనింగ్ మేనేజర్ సురేష్, ఉమ్మడి కడప జిల్లా నుంచి 50 మంది టాట్స్, మాస్టర్ ట్రైనర్లు, పంచాయతీ సెక్రటరీలు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డీపీవో రాజ్యలక్ష్మి

జీవన ఎరువులపై అవగాహన కల్పించాలి



తాడిగొట్లలో వ్యవసాయ కళాశాల విద్యార్థులు ఏర్పాటు చేసిన కృషి అనుభవ కార్యక్రమం

సీకేదిన్నె, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): జీవన ఎరువులపై రైతులకు అవగాహన కల్పించాలని డాట్ సెంటర్ సమన్వయకర్త క్రిష్ణప్రియ తెలిపారు. చింతకొమ్మదిన్నె మండలం తాడిగొట్లలో సోమవారం ఎస్వీ వ్యవసాయ కళాశాల తిరుపతి, ఎస్ఎంజీఆర్ వ్యవసాయ కళాశాల ఉదయగిరి విద్యార్థులకు జీవన ఎరువులపై గ్రామీణ అవగాహన కృషి అనుభవ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు స్థానికంగా, ప్రత్యక్షంగా వ్యవసాయంలో అనుభవం పొందడమేకాకుండా రైతుల్లో స్థిరమైన వ్యవసాయ పద్ధతులపై అవగాహన పెంచుకోవాలన్నారు. రైతులతో చర్చా కార్యక్రమాలు నిర్వహించి వారి అనుభవాలను తెలుసుకోవాలన్నారు. కార్యక్రమంలో స్థానిక రైతులు వ్యవసాయ విద్యార్థులు హర్షిణి, అమీనా, క్రిష్ణ, దుశల, దామిని, తదితరులు పాల్గొన్నారు.

16న ప్రభుత్వ పురుషుల కళాశాలలో మినీ జాబ్‌మేళా

కడప మారుతీనగర్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): జవహర్ నాలెడ్జ్ సెంటర్ (జేకేసీ) ఆధ్వర్యంలో ఈనెల 16వ తేదీ గురువారం నగర ప్రభుత్వ పురుషుల కళాశాల (స్వయంప్రతిపత్తి)లో మినీ జాబ్ మేళా కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆ కళాశాల ప్రిన్సిపాల్ జి.రవీంద్రనాథ్ తెలిపారు. ఇందులో హెటిరో ల్యాబ్స్ లిమిటెడ్, ఎన్ఐఐటీ, (యాక్సిస్‌బ్యాంక్) నెక్స్‌టెల్ మెటా ప్రయివేట్ లిమిటెడ్, అపోలో ఫార్మసీ తదితర సంస్థలు పాల్గొంటున్నాయని కో ఆర్డినేటర్ సీహెచ్ రాము వెల్లడించారు. ఇంటర్, డిగ్రీ, బి.టెక్, మాస్టర్ డిగ్రీ, అండ్ డిగ్రీ ఫైనల్ ఇయర్ చదువుతున్న విద్యార్థులు ఇందులో పాల్గొనేందుకు అర్హులన్నారు. ఈ జాబ్ మేళాలో పాల్గొనే ఔత్సాహికులు 4 సెట్స్ బయోడేటా, ఆధార్, పాన్‌కార్డుతో పాటు సర్టిఫికెట్స్ జిరాక్స్ ప్రతులతో హాజరు కావాలని కోరారు. వివరాలకు 9390052901, 9347256400 అనే నెంబర్లను సంప్రదించాలని సూచించారు.

ఈ-నామ్‌తో చీనీకి మెరుగైన ధర

- వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ అమర్‌నాథ్‌యాదవ్

పులివెందుల, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): పులివెందుల మార్కెట్ యార్డుకు వచ్చే చీనీ రైతులకు మెరుగైన ధరకోసం ఈ-నామ్ విధానం అమలు చేయబోతున్నామని వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ గడ్డం అమర్‌నాథ్‌యాదవ్ పేర్కొన్నారు. సోమవారం మార్కెట్ యార్డులోని తన కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. పులివెందులలో చీనీ వ్యాపారంపై కూటమి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. గతంలో వ్యాపారులు సిండికేట్ అయి తక్కువ ధర పాడుతున్నారని రైతుల నుంచి తీవ్ర ఆరోపణలు వచ్చాయన్నారు. ఆ సమయంలో కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి, టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి బీటెక్ రవి, మార్కెటింగ్ శాఖ అధికారులు సమన్వయంతో పలుమార్లు మార్కెట్ యార్డులోని చీనీవ్యాపారాన్ని పరిశీలించారన్నారు. రైతులను మోసం చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారన్నారు. రెండు నెలలుగా మార్కెట్ యార్డుపై రైతుల్లో సానుకూలత వస్తోందన్నారు. రైతులకు మార్కెట్‌పై నమ్మకం కలిగేందుకు మరిన్ని చర్యలు చేపడుతున్నామన్నారు. అందులో భాగంగా ఈ-నామ్ మార్కెటింగ్ విధానాన్ని 15వ తేదీ బుధవారం నుంచి అమలు చేయబోతున్నామన్నారు. ఈ విధానానికి ప్రతి ఒక్కరు మొగ్గు చూపితే ఆన్‌లైన్ ద్వారానే వ్యాపారాలు సాగుతాయన్నారు. పులివెందుల మార్కెట్ యార్డులో ఉన్న చీనీకాయలను ముంబై, ఢిల్లీ, చెన్నై తదితర నగరాల నుంచి సైతం వ్యాపారులు కొనుగోలు చేసేందుకు అవకాశం ఉంటుందన్నారు. రైతులు పంట అమ్మిన వెంటనే డబ్బు చెల్లించే వెసులుబాటు కూడా ఉంటుందన్నారు. ఈ-నామ్ పద్ధతితో రైతులందరికీ మేలు జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి శ్రీధర్ పాల్గొన్నారు.

మూగబోయిన జీవితం...

- భర్త ఆకస్మిక మరణం
- అనాథలైన భార్య, కూతురు

ప్రొద్దుటూరు/దువ్వూరు, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నీలాపురం గ్రామంలో కాశిపోయిన గంగయ్య ఆకస్మిక మరణంతో ఆ కుటుంబం అనాథగా మారింది. గంగయ్య నాగలక్ష్మ్మ దంపతులు దివ్యాంగులు (మూగవారు). వీళ్లు నిరుపేదకుటుంబానికి చెందినవారు. శనివారం ఇంటి నుంచి ప్రొద్దుటూరు మున్సిపాలిటీలో విధులకు వెళ్లిన గంగయ్య సోమవారం మృతిచెందాడనే విషయం తెలుసుకుని భార్యతోపాటు తొమ్మిదేళ్ల కూతురు మల్లిక శోకసముద్రంలో మునిగిపోయారు. గ్రామంలో మూగదంపతులు రేకుల షెడ్డుతో నిర్మించుకున్న ఇంటిలో నివశిస్తున్నారు. గంగయ్య నీలాపురంలో వ్యవసాయ కూలి పనులకు వెళుతూ కుటుంబాన్ని పోషించేవాడు. మూడేళ్ల కిందట ప్రొద్దుటూరు డంపింగ్‌యార్డులో గంగయ్య విధుల్లో చేరినట్లు స్థానికులు తెలిపారు. దీంతో లభిస్తున్న జీతంతో కుటుంబ భారాన్ని నెట్టుకొస్తున్నాడు. ఈ క్రమంలో శనివారం విధులకు వెళ్లి తిరిగి రాకపోవడంతో కుటుంబీకుల్లో ఆందోళన మొదలై వాకబు చేస్తూ వచ్చారు. సోమవారం ఉదయం విధులు నిర్వహించే పరిసరాల్లో బహిర్భూమికి వెళ్లి మృతి చెంది ఉన్నట్లు సమాచారం తెలుసుకుని భార్య, కూతురు బోరున విలపించారు. భర్తను కోల్పోయిన నాగలక్ష్మి, ఆమె కూతురు మల్లిక రోదన అక్కడి చూపరులను కలిచివేసింది.

అనుమానాస్పద స్థితిలో మృతి

ప్రొద్దుటూరు పట్టణంలోని పొట్టిపాడు రోడ్డులోని మున్సిపల్ కంపోస్టుయార్డులో పారిశుధ్య కార్మికుడిగా పనిచేస్తున్న కాశిబోయిన గంగయ్య (41) అనుమానాస్పదస్థితిలో మృతి చెందాడు. వివరాల్లోకి వెళితే... దువ్వూరు మండలం నీలాపురం గ్రామానికి చెందిన గంగయ్య దివ్యాంగుడు (మూగవారు). దీంతో ఇతనికి బ్యాక్‌లాగ్ కింద మున్సిపాలిటీలో పారిశుధ్య కార్మికుడిగా ఉద్యోగం వచ్చింది. శనివారం ఉదయం 7.30 గంటలకు కంపోస్టుయార్డులో డ్యూటీకి వచ్చిన గంగయ్య మధ్యాహ్నం 11 గంటల వరకు విధుల్లో ఉన్నట్లు అక్కడి సిబ్బంది తెలి పారు. 11.30 గంటలకు డ్యూటీ అయిపోగానే ఎవరికి





కాశిపోయిన గంగయ్య (ఫైల్), అనాథలైన భార్య, కూతురు

వారు ఇళ్లకు వెళ్లిపోయారు. గంగయ్య శనివారం నీలాపురంలోని తన ఇంటికి రాకపోవడంతో అతని భార్య, బంధువులు ఆదివారం ప్రొద్దుటూరుకు వచ్చి మున్సిపాలిటీలో విచారించారు. గంగయ్య ఆచూకీ తెలియకపోవడంతో మధ్యాహ్నం రూరల్ పోలీసు స్టేషన్‌లో బంధువులు మిస్సింగ్ అయినట్లు ఫిర్యాదు చేశారు. సోమవారం ఉదయం కంపోస్టు యార్డులో డోజర్ ఆపరేటర్ బహిర్భూమికి వెళ్లగా.. అక్కడ పురుగులు పట్టిన గంగయ్య మృతదేహాన్ని చూసి మున్సిపల్ అధికారులకు తెలియజేశారు. వెంటనే మున్సిపల్ అధికారులు రూరల్ పోలీసులకు సమాచారం ఇవ్వగా విచారించారు. గంగయ్య మల విసర్జన కోసం కంపోస్టుయార్డులోని పల్వరైజింగ్ మిషన్ సమీపంలో సందులోకి వెళ్లి గుండెపోటు వచ్చి మరణించి ఉండవచ్చని అను మానం వ్యక్తం చేశారు. అతను మలవిసర్జనకు కూర్చున్న పొజిషన్‌లోనే ముందుకు పడి ఉన్నట్లు గుర్తించారు. మృత దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. గంగయ్య భార్య కూడా మూగ చెవిడు వున్న దివ్యాంగురాలు. వీళ్లకు ఒక ఆడబిడ్డ వుంది.

పరుగు పందెంలో విద్యార్థినుల ప్రతిభ


గెలుపొందిన విద్యార్థినులతో ప్రిన్సిపాల్

పీలేరు రూరల్, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): మదనపల్లెలో జరిగిన క్రీడా పోటీలలో బాలికల గురుకుల పాఠశాల విద్యార్థినులు ఉత్తమ ప్రతిభ కనబరిచి జిల్లా స్థాయి పోటీలకు ఎంపికైనట్లు గురుకులం ప్రిన్సిపాల్ లోకేశ్వరి తెలిపారు. సోమవారం ఆమె పీలేరులో మాట్లాడుతూ అండర్-14 డివిజన్ స్థాయిలో జరిగిన 400 మీటర్ల పరుగు పదెంలో 9వ తరగతి విద్యార్థిని శృతి, 10వ తరగతి విద్యార్థిని కీర్తి ప్రథమ స్థానం సాధించి జిల్లా పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థినులను, పీఈటీ సమీరభానును ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు అభినందించారు.

ఎస్సీ, ఎస్టీ కాలనీలకు గౌరవప్రదమైన పేర్లు పెట్టాలి

పీలేరు, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎస్సీ, ఎస్టీల కాలనీలకు గౌరవప్రదమైన పేర్లు పెట్టాలని డీవీఎంసీ సభ్యుడు బోద షావలి కోరారు. ఈ మేరకు సోమవారం ఆయన తహసీల్దారు శివకుమార్‌కు వినతిపత్రం అందించారు. ప్రతి పంచాయతీలోని ఎస్సీ, ఎస్టీ గ్రామాలను దళితవాడ, హరిజనవాడ, గిరిజనవాడ వంటి పేర్లతో పిలుస్తున్నారని, దీనిని ఆయా ప్రజలు అగౌరవంగా భావిస్తున్నారని తెలిపారు. ఆ పేర్లు మార్చాలని కేంద్ర ప్రభుత్వం కూడా ఆదేశాలు జారీ చేసిందన్నారు. ఆయా కాలనీల్లో గ్రామసభలు నిర్వహించి, అత్యధిక ప్రజల సూచనల మేరకు గౌరవప్రదమైన పేర్లు పెట్టాలని కోరారు.

కూటమి ప్రభుత్వానికి కృతజ్ఞతలు

నిమ్మనపల్లి, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): పంచాయతీ రాజ్ వ్యవస్థలో ఎంతోకాలంగా ఎదురుచూస్తున్న పదోన్నతులపై కూటమి ప్రభుత్వం తీపి కబురు అందించింది. దీంతో మండలంలోని పంచాయతీ కార్యదర్శులు సోమవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో సీఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్, ప్రిన్సిపల్ సెక్రటరీ, కమిషనర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పంచాయతీలో క్లస్టర్ వ్యవస్థను రద్దు చేసి స్వతంత్ర గ్రామ పంచాయతీలుగా మార్చేందకు కేబినెట్ ఆమోదం తెలిపిందన్నారు. అలాగే గ్రేడ్-1, 2, 3 పంచాయతీలుగా గుర్తించారని, వీటి ఆధారంగా పంచాయతీ కార్యదర్శులకు పదోన్నతులు కల్పించడం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో బాలరాజు పాల్గొన్నారు.

జాబ్‌కార్డుదారులకు ఈకేవైసీ తప్పనిసరి

నిమ్మనపల్లి, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకంలో జాబ్‌కార్డు కలిగిన ఉపాధి వేతనదారులు తప్పనిసరిగా ఈకేవైసీ చేసుకోవాలని ఎంపీడీవో రమేశ్ అన్నారు. సోమవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాబ్‌కార్డులో ఎంత మంది వుంటే అందరూ ఈకేవైసీ చేసుకోవాలన్నారు. జాబ్‌కార్డు వుండి ఈకేవైసీ చేయించుకోకపోతే అలాంటి వారు ఉపాధి పనికి అనర్హులని తెలిపారు. అలాగే ఉపాధి సిబ్బంది సకాలంలో ఈకేవైసీని పూర్తి చేయాలని తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపిడివో బాలరాజు, కార్యదర్శులు పాల్గొన్నారు.

బాణాసంచా దుకాణాలకు స్థల పరిశీలన

పెద్దతిప్పసముద్రం, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన పెద్దతిప్పసముద్రంలో దీపావళి పండుగకు బాణాసంచా దుకాణాలను నిర్వహించేందుకు ఊరి బయట స్థలాన్ని కేటాయించాలని కోరడంతో సోమవారం తహసీల్దార్ శ్రీరాములు నాయక్ దుకాణాదారులకు స్థలాన్ని పరిశీలించారు. స్థానిక పీటీఎం ఏటిగడ్డ సమీపంలో ఉన్న ఆంజనేయస్వామి ఆలయం వద్ద రెండు దుకాణాలకు అనుమతులు ఉన్నాయన్నారు. అనుమతులు పొందిన యాజమానులు ప్రభుత్వం సూచించిన నియమ నిబంధనల మేరకు దుకాణాలను నిర్వహించుకోవాలన్నారు. నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తీసుకుంటామన్నారు.

వీఆర్వోల సంఘం అధ్యక్షుడిగా నాగరాజు



తంబళ్లపల్లె, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): తంబళ్లపల్లె వీఆర్వోల సంఘం మండల అధ్యక్షుడిగా తంబళ్లపల్లె-2 వీఆర్వో నాగరాజు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సోమవారం స్థానిక తహసీల్దారు కార్యాలయంలో రాష్ట్ర కోశాధికారి జాన్సన్ ప్రదీప్‌కుమార్ అధ్యక్షతన ఎన్నికల అధికారి ఆర్‌ఐ ముద్దుక్రిష్ణ ఆధ్వర్యంలో ఈ ఎన్నిక నిర్వహించారు. మండల అధ్యక్షుడిగా ఎం.నాగరాజు, ప్రధాన కార్యదర్శిగా బి.వెంకటేశ్, కోశాధికారిగా రాజగోపాల్, గౌరవ అధ్యక్షుడిగా సంజీవకుమార్, ముఖ్య సలహాదారుగా సలీంబాషను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వీఆర్వోల సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తామని నూతనంగా ఎన్నికైన కార్యవర్గం తెలిపారు.

స్కాన్ చేసి మద్యం బాటిళ్ల నాణ్యతను తెలుసుకోవచ్చు : ఎక్సైజ్ సీఐ

మదనపల్లె టౌన్, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర బేవరేజెస్ సంస్థ ఆధ్వర్యంలో సరఫరా చేస్తూ, మద్యం దుకాణాల్లో విక్రయిస్తున్న మద్యం బాటిళ్లను వినియోగదారులు స్కాన్ చేసి దాని నాణ్యతను తెలుసుకోవచ్చని ఎక్సైజ్ సీఐ భీమలింగ తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ మద్యం బాటిళ్లపై వచ్చే కొత్త లేబుళ్లను స్కాన్ చేసేందుకు ప్రభుత్వం మొబైల్ యాప్‌ను తీసుకొస్తోందన్నారు. ఈనెల 16 నుంచి ఈ అవకాశం అందుబాటులోకి వస్తుందన్నారు. కొందరు కల్తీ మద్యం తయారీపై రాద్ధాంతాలు చేస్తున్నారని, అలాంటి వాటిని ప్రజలు నమ్మవద్దన్నారు. అంతకు ముందు స్థానిక ఎక్సైజ్ పోలీసు స్టేషన్ వద్ద వైసీపీ ఇన్‌చార్జి నిస్సార్‌అహ్మద్ ఆధ్వర్యంలో కల్తీ మద్యం గుట్టురట్టు చేయాలని వైసీపీ నాయకులు ధర్నా నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే దేశాయ్‌తిప్పారెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ మనూజ, ఏపీ ఎండీసీ మాజీ చైర్‌పర్సన్ షమీంఅస్లాం, పుంగనూరు వైసీపీ నాయకులు అనూషారెడ్డి, శ్రీనాథరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సీబీఐతో విచారణ చేయించాలి

ములకలచెరువు, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): ములకలచెరువు నకిలీ మద్యం వ్యవహారాన్ని సీపీఐ చేత విచారణ చేయించాలని వైసీపీ నాయకులు, కార్యకర్తలు డిమాండు చేశారు. ఈ మేరకు సోమవారం స్థానిక మార్కెట్ యార్డు నుంచి ర్యాలీగా వచ్చి ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్ ఎదుట బైఠాయించారు. నకిలీ మద్యం వ్యవహారాన్ని సిట్ కాకుండా సీబీఐతో విచారణ చేపట్టాలని కోరారు. అనంతరం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, కూటమి ప్రభుత్వానికి వ్యతిరేకంగా పెద్దఎత్తున నినాదాలు చేశారు. కార్యక్రమంలో వైసీపీ మండల కన్వీనర్ మాధవరెడ్డి, ఆరు మండలాల ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్ ఎదుట ధర్నా చేస్తున్న వైసీపీ నాయకులు

కమనీయం.. శివపార్వతుల కల్యాణం

పెద్దతిప్పసముద్రం, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన పీటీఎంలో వెలసిన ప్రసన్న పార్వతీ సమేత విరూపాక్షేశ్వరస్వామి ఆలయంలో సోమవారం శివపార్వతుల కల్యాణోత్సవం కమనీయంగా నిర్వహించారు. స్వామివారి జన్మ నక్షత్రమైన ఆరుద్ర నక్షత్రం రోజున శివపార్వతుల కల్యాణం నిర్వహించడం ఆనవాయితీ. పీటీఎంకు చెందిన ఆధ్యాత్మికవేత్త ననగరం పట్టాభిరామయ్య ఆధ్వర్యంలో ఉదయం అభిషేక పూజలు చేశారు. సాయంత్రం ఆలయంలో స్వామివారి ఉత్సవమూర్తులను ప్రత్యేకంగా అలంకరించి కల్యాణోత్సవం వైభవంగా నిర్వహించారు. అధిక సంఖ్యలో తరలివచ్చిన భక్తులు స్వామివారి కల్యాణాన్ని తిలకించి తీర్థప్రసాదాలు స్వీకరించారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు.


శివపార్వతుల కల్యాణ క్రతువును నిర్వహిస్తున్న అర్చకులు

నేడు వాల్మీకిపురంలో ఎమ్మెల్యే పర్యటన

వాల్మీకిపురం, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డి మంగళవారం వాల్మీకిపురంలో పర్యటించనున్నట్లు మార్కెట్ కమిటీ చైర్మన్ కోసూరి చంద్రమౌళి, టీడీపీ మండల అధ్యక్షుడు మల్లికార్జునరెడ్డి పేర్కొన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం మధ్యాహ్నం 3గంటలకు ప్రభుత్వ అధికారులతో సమీక్షా సమావేశంలో ఆయన పాల్గొంటారని, అనంతరం కూటమి పార్టీల మండల నాయకులు, కార్యకర్తలతో మాట్లాడతారని తెలిపారు.

బాలికల గురుకులం ప్రిన్సిపాల్‌గా ఫకృన్నిసా



పీలేరు, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): పీలేరులోని మహాత్మా జ్యోతిబా పూలే ఆంధ్రప్రదేశ్ వెనుకబడిన తరగతుల సంక్షేమ బాలికల గురుకులం ప్రిన్సిపాల్‌గా ఫకృన్నిసా సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పాఠశాల అభివృద్ధికి అధ్యాపక బృందంతో కలిసి పనిచేయనున్నట్లు తెలిపారు. ఆమె గత ఆరేళ్లుగా ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో ఏజీటీ, జూనియర్ లెక్చరర్‌గా విధులు నిర్వర్తించారు.

నేడు మస్తాన్‌వలీ ఖాద్రి ఉరుసు

రామసముద్రం, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని దిగువపేటలో ఉన్న దివానే మస్తాన్ వల్లి ఖాద్రి దర్గాలో మంగళవారం గంధం మహోత్సవం, ఉరుసు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. మంగళవారం సాయంత్రం 6గంటల నుండి 8గంటల వరకు ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు దర్గా కమిటీ సభ్యులు తెలిపారు. అలాగే రాత్రి ఫాతెహా, అన్నదానం, ఖవ్వాలి కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు.

'ఆడపిల్ల చదువు.. కుటుంబానికి వెలుగు'

రామముద్రం, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): ఆడపిల్ల చదువు.. కుటుంబానికి వెలుగు అని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రమాదేవి అన్నారు. మండలంలోని చెంబకూరు జడ్పీ హైస్కూల్‌లో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో సోమవారం అంతర్జాతీయ బాలికల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాలికలు చదువుకుంటే కుటుంబం మొత్తం విద్యావంతులవుతారన్నారు. ఆడపిల్లలే దేశానికి ఆస్తి అని, లింగ నిర్ధారణ చేయించకుండా మహిళలను కాపాడుకుందామన్నారు. మిషన్ శక్తి, బేటీ బచావో-బేటీ పడావో కార్యక్రమాలను విజయవంతం చేయడానికి అంగన్వాడీ కార్యకర్తలు కృషి చేయాలన్నారు. అనంతరం విద్యార్థులకు వ్యాసరచన, సమూహ చర్చ పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం రమేశ్‌బాబు, చందన, అంగన్వాడీ కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.


విద్యార్థినులకు బహుమతులు అందిస్తున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రమాదేవి

సూపర్ జీఎస్టీతో ప్రజలకు ఆర్థికంగా ఎంతో మేలు


ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు, డ్వాక్రా సభ్యులు తదితరులు

రామసముద్రం, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): సూపర్ జీఎస్టీ-సూపర్ సేవింగ్స్ ద్వారా ప్రజలకు ఆర్థికంగా ఎంతో మేలు జరుగుతుందని టీడీపీ మండల అధ్యక్షుడు విజయకుమార్ గౌడ్, ఎంపీడీవో లతీఫ్‌ఖాన్, జీఎస్టీ అసిస్టెంట్ కమర్షియల్ ట్యాక్స్ ఆఫీసర్ రఫీ తెలిపారు. మండలం కేంద్రంలో సోమవారం సూపర్ జీఎస్టీ-సూపర్ సేవింగ్స్‌పై వ్యాపారులు, సెక్రటరీలు, డ్వాక్రా సంఘం సభ్యులకు అవగాహన సదస్సు, ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 90 రకాల వస్తువులు విక్రయించాలని, అలాగే తగ్గించిన జీఎస్టీ ప్రకారం వస్తువుల ధరల పట్టికను దుకాణాల ముందు ఏర్పాటు చేయాలన్నారు. జీఎస్టీ తగ్గక మునుపు కొనుగోలు చేసిన వస్తువులను కూడా తగ్గిన రేట్లతోనే అమ్మాలని, అలా కాకుండా అధిక ధరలకు అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏపీఎం సాంబశివ, ఆర్‌డబ్ల్యూఎస్ రియాజ్, తదితరులు పాల్గొన్నారు.

సీపీఆర్ పట్ల ప్రతి ఒక్కరికి అవగాహన అవసరం


అవగాహన కల్పిస్తున్న హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ మొహ్మద్‌రఫీ

వాల్మీకిపురం, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): సీపీఆర్ పట్ల ప్రతి ఒక్కరికి అవగాహన అవసరమని డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ మొహ్మద్‌రఫీ అన్నారు. సోమవారం మండలంలోని విఠలం గ్రామంలో ఆయుష్మాన్ ఆరోగ్యమందిర్ కార్యక్రమంలో భాగంగా ప్రజలకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గుండె కొట్టుకోవడం ఆగిపోయినప్పుడు లేదా శ్వాస తీసుకోవడం కష్టమైనప్పుడు చేసే అత్యవసర ప్రథమ చికిత్సనే సీపీఆర్ అంటారన్నారు. మెదడు, అవయవాలకు రక్తప్రసరణ కొనసాగించడానికి గుండె, శ్వాస పునర్ధురించబడే వరకు ప్రాణాలను కాపాడడానికి ఈ సీపీఆర్ విధానం ఎంతగానో సహాయపడుతుందన్నారు. అనంతరం గ్రామీణ ప్రజలకు వైద్య సరీక్షలు, మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది రెడ్డెమ్మ, అరుణ, నాగరత్న, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

గుండె సమస్యలు వస్తే వెంటనే వైద్యులను సంప్రదించాలి

పెద్దమండ్యం, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): గుండె సమస్యలు వస్తే వెంటనే వైద్యులను సంప్రదించాలని లయన్స్‌క్లబ్ ప్రెసిడెంట్ సుబ్రమణ్యం అన్నారు. మండలంలోని వెలిగల్లులో మదనపల్లి లయన్స్‌క్లబ్, అభయ సహకారంతో బెంగుళూరు నారాయణ హృదయాలయ, జాలప్ప మెడికల్ కాలేజీ సంయుక్తంగా సోమవారం ఉచిత గుండె వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందరర్భంగా టూడీ, ఈసీజీ వంటి గుండెకు సంబంధించిన వైద్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీధర్‌రావు, లయన్స్‌క్లబ్ వైద్య నిపుణులతో పాటు కార్యదర్శి సంతోష్‌కుమార్, చిన్నపరెడ్డి, పంచాయతీ కార్యదర్శి ఖాదర్‌బాష, ప్రసాద్‌రెడ్డి, అశోక్‌కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికులను తొలగించరాదని నిరసన

మదనపల్లె అర్బన్, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ జిల్లా ఆస్పత్రిలో 50 ఏళ్ల నిండిన పారిశుధ్య కార్మికులకు తొలగించరాదని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివ డిమాండు చేశారు. ముందు పని చేస్తున్న కార్మికులను కొత్తగా వచ్చిన ఏజన్సీ తొలగించడం దారుణమన్నారు. వారిని తిరిగి విధుల్లోకి తీసుకోవాలని, ఆరు నెలల పెండింగ్ జీతం వెంటనే ఇవ్వాలని డిమాండు చేశారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు, పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.

వైభవంగా అయ్యప్పస్వామి గ్రామోత్సవం

తంబళ్లపల్లె, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): తంబళ్లపల్లె కోదండ రామాలయంలో ఉన్న అయ్యప్ప స్వామి ఆలయంలో సోమవారం అయ్యప్ప మాలధారణ భక్తులు ప్రత్యేక పూజలు అభిషేకాలు చేశారు. సాయంత్రం అయ్యప్పస్వామి ఉత్సవ విగ్రహాన్ని ప్రత్యేకంగా పూలతో అలంకరించిన వాహనంలో కొలువుదీర్చి సాంస్కృతిక కార్యక్రమాల నడుమ పట్టణంలో మెరవణి నిర్వహించారు. భక్తులు స్వామివారికి దర్శించుకుని కాయకర్పూరం సమర్పించారు. ఈ ఊరేగింపులో కళాకారులు వేసిన పిల్లనగ్రోవి నృత్యాలు అందరినీ విశేషంగా ఆకట్టుకున్నాయి.

మల్లయ్యకొండలో ప్రత్యేక పూజలు

తంబళ్లపల్లె, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): తంబళ్లపల్లెకు సమీపంలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన మల్లయ్యకొండలో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాయలసీమ జిల్లాల నుంచే కాకుండా ఇతర ప్రాంతాల నుంచి భక్తులు కుటుంబసమేతంగా మల్లయ్యకొండకు తరలివచ్చి భ్రమరాంబిక సమేత మల్లికార్జునస్వామిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ముందుగా స్వామివారికి నాగాభరణం, పూలతో విశేషంగా అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. అనంతరం కొండపైన భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా భక్తులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా ఆలయ ఈవో మునిరాజ అన్ని సౌకర్యాలు కల్పించారు.

వాటర్‌షెడ్ నిధులు సద్వినియోగం చేసుకోవాలి



పెద్దమండ్యం, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): వాటర్‌షెడ్ నిధులు అభివృద్ధి పనులకు సద్వినియోగం చేసుకోవాలని వాటర్‌షెడ్ ఏపీడీ లక్ష్మీనరసయ్య అన్నారు. స్థానిక వాటర్‌షెడ్ కార్యాలయంలో సోమవారం సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెద్దమండ్యం, కలిచెర్ల వాటర్‌షెడ్ల ప్రాజెక్టుల పరిధిలో రూ.7 కోట్ల నిధులతో భూగర్భ జలాలు పెంచడంతో పాటు రైతులకు మేలు చేకూరే పనులు చేపట్టాలన్నారు. ఈ నిధులు ఈ ఏడాది నవంబరు చివరిలోపు వాడాలని, లేకుంటే ఈ నిధులు ఇతర గ్రామాల కొత్త వాటర్‌షెడ్ల అభివృద్ధి పనులకు వినియోగిస్తారని తెలిపారు. కార్యక్రమంలో పీవో రవీంద్రుడు, జేఈ మోహన్, సిబ్బంది పాల్గొన్నారు.

రెస్టారెంట్‌లో టేబుల్ రిజర్వ్ కోసం నూతన యాప్

● టబులో యాప్‌ను రూపొందించిన మిట్స్ విద్యార్థులు


రెస్టారెంట్‌లో టేబుల్ రిజర్వ్ కోసం నూతన యాప్‌ను ఆవిష్కరిస్తున్న డీమ్డ్ టు బీ మిట్స్ వీసీ యువరాజ్

కురబలకోట, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): సాధారణంగా ప్రతి ఒక్కరు తమ పనులలో బిజిబిజీగా గడుపుతుంటారు. అయితే సమయం దొరికినప్పుడు తమ కుటుంబంతోనో, స్నేహితులతో రెస్టారెంట్లకు వెళ్లినప్పుడు అక్కడ రద్దీ ఎక్కువగా ఉండి టేబుల్ దొరక్క వెనుదిరిగిన సందర్భాలు ఉండివుంటాయి. సెలవులు, ప్రత్యేక రోజులలో ఈ రద్దీ మరీ ఎక్కువగా ఉండటంతో సమయానికి టేబుల్స్ దొరకపోవడంతో గంటల కొద్ది వేచిఉండాల్సి ఉంటుంది. వీటిని దృష్టిలో ఉంచుకుని డీమ్డ్ టు బీ మిట్స్ యూనివర్శిటీ విద్యార్థులు ముందస్తుగా రెస్టారెంట్‌లో టేబుల్‌ను రిజర్వ్ చేసుకునేందు కోసం ఒక నూతన యాప్‌ను ఆవిష్కరించారు. సీఎస్‌టీ ఫైనలియర్ విద్యార్థి ఇమ్రాన్, ఈసీఈ విద్యార్థి తనూజ్, మెకానికల్ విద్యార్థి చైతన్య, సీఎస్‌టీ విద్యార్థి నవీన్‌కుమార్, తృతీయ సంవత్సరం ఈసీఈ విద్యార్థులు అహ్మద్ అఫ్సహాన్, సయ్యద్ జునైద్ ఆధునిక సాంకేతికతతో సమయం వృధా కాకుండా కస్టమర్ల సౌకర్యార్థం టబులో అనే నూతన యాప్‌ను ఆవిష్కరించారు. దీని ద్వారా మనం ఎంపిక చేసుకున్న రెస్టారెంట్‌లలో మన వీలు, సమయాన్ని బట్టి ఈ యాప్ ద్వారా ముందుగా టేబుల్‌ను రిజర్వ్ చేసుకోవచ్చు. ఇది రెస్టారెంట్ నిర్వాహకులకు, కస్టమర్లకు ఎంతగానో ఉపయోగకరంగా ఉంటుంది. ఈ యాప్‌ను త్వరలోనే ఐఓఎస్ ప్లాట్‌ఫామ్‌లో అందుబాటులోకి తీసుకురానున్నట్లు డీమ్డ్ టు బి మిట్స్ వీసీ యువరాజ్ తెలిపారు. కాగా విద్యార్థులను ఐఈఈఈ కో ఆర్డినేటర్ కుమార్, రామనాథమ్, దినేష్ తదితరులు అభినందించారు.

Tabuloo
Dine Smarter with Tabuloo.

కొత్త ఉపాధ్యాయులు విధుల్లో చేరిక


కొత్తగా విధుల్లో చేరిన ఉపాధ్యాయులతో ఎంఈవో

పీలేరు రూరల్, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): కేవీపల్లె మండలంలో 9 మంది కొత్త ఉపాధ్యాయులు విధుల్లో చేరినట్లు ఎంఈవో రెడ్డి బాషా తెలిపారు. ఈ మేరకు స్థానిక ఎంఆర్‌సీ భవనం వద్ద నూతన ఉపాధ్యాయులకు నియామక పత్రాలు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2025 మెగా డీఎస్సీలో ఎంపికైన ఉపాధ్యాయులు మండలంలోని పలు పాఠశాలల్లో విధుల్లో చేరినట్లు తెలిపారు. అంకితభావంతో పనిచేయాలని, విద్యార్థుల ఉన్నతికి శక్తివంచన లేకుండా కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎంఈవో-2 సుబ్రమణ్యంరెడ్డి, కొత్త ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు. మండలంలోని గువ్వలగూడెం, తువ్వపల్లె, దొరేవాండ్లపల్లె, పెద్దతాండ, పెండ్లిపెంట, ప్యాయలవారిపల్లె, మారేళ, బొప్పసముద్రం పాఠశాలల్లో కొత్త ఉపాధ్యాయులు విధుల్లో చేరారు.

బాధ్యతలు స్వీకరించిన ఉపాధ్యాయులు

తంబళ్లపల్లె, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): డీఎస్సీ-2025 కింద ఎంపికైన నూతన ఉపాధ్యాయులు సోమవారం ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. తంబళ్లపల్లె మండల పరిధిలో 34మంది ఉపాధ్యాయులు వివిధ ప్రాంతాల నుంచి ఎమ్మార్సీ కార్యాలయం వద్దకు వచ్చారు. ఈ సందర్భంగా ఎంఈవోలు త్యాగరాజు, నాగసుబ్బరాయుడు వారికి నియామక పత్రాలను అందించి అభినందనలు తెలిపారు. 21 మంది ప్రాథమిక పాఠశాలలకు, తంబళ్లపల్లె హైస్కూల్‌కు ఇద్దరు, గోపిదిన్నె హైస్కూలుకు ఇద్దరు, మోడల్ స్కూల్‌కు ముగ్గురు, ట్రైబల్ స్కూల్‌కు ఆరుగురు ఉపాధ్యాయులు వచ్చినట్లు ఎంఈవోలు తెలిపారు.

నియామక పత్రాల అందజేత



నియామక పత్రాలు అందిస్తున్న ఎంఈవోలు నారాయణ, గౌస్‌పీర్

పెద్దతిప్పసముద్రం, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన మెగా డీఎస్సీ ద్వారా ఎంపికైన ఉపాధ్యాయులు 31 మంది మండలంలోని వివిధ పాఠశాలల్లో సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా వారికి ఎంఈవోలు నారాయణ, గౌస్‌పీర్ నియామక పత్రాలను అందించి పిల్లల విద్యాభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. ఆయా గ్రామాల ప్రజలతో మమేకమై విద్యాశాఖ చేపట్టే అన్ని కార్యక్రమాలను అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ సంఘం నాయకులు శంకర్, శ్రీనివాసులు, అశోక్‌రెడ్డి, ఎంఆర్సీ సిబ్బంది, సీఆర్పీలు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ వృత్తి ఉన్నతమైనది

పెద్దమండ్యం, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ వృత్తి ఉన్నతమైనదని ఎంఈవోలు మనోహర్, రామకృష్ణ పేర్కొన్నారు. మండలంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో సోమవారం 27 మంది నూతన ఉపాధ్యాయులు విధుల్లోకి చేరినట్లు వారు వెల్లడించారు. ఈ సందర్భంగా స్థానిక ఎమ్మార్సీ భవనంలో నూతన ఉపాధ్యాయులకు నియామక పత్రాలు అందించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ ఉపాధ్యాయులు సకాలంలో పాఠశాలలకు వెళ్లి విద్యార్థులకు ఉత్తమ బోధన అందించాలన్నారు. కార్యక్రమంలో సురేంద్రరెడ్డి, సీవీ రమణ, సీఆర్పీలు, తదితరులు పాల్గొన్నారు.


నూతన ఉపాధ్యాయుల సమావేశంలో మాట్లాడుతున్న ఎంఈవో మనోహర్

సేతు దంపతులకు గజమాల వేసి శుభాకాంక్షలు తెలుపుతున్న సర్పంచ్ చలపతి



ఘనంగా సేతు జన్మదిన వేడుకలు

మదనపల్లె టౌన్/కురబలకోట, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): మదనపల్లె పట్టణం సొసైటీకాలనీలో విజయభారతి హైస్కూల్ చైర్మన్ ఎన్.సేతు జన్మదిన వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణ ప్రముఖులు, విద్యాశాఖ అధికారులు, రాజకీయ నాయకులు, సామాజిక కార్యకర్తలు, ప్రజాసంఘాల నాయకులు వేర్వేరుగా వచ్చి సేతుకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. బీజేపీ సీనియర్ నేత చల్లపల్లె నరసింహారెడ్డి, కురవంక సర్పంచ్ చిప్పిలి చలపతి గజమాలతో సేతు దంపతులను సన్మానించారు. తెలుగు యువత రాష్ట్ర అధ్యక్షుడు శ్రీరామ్‌చినబాబు, తంబళ్లపల్లె నియోజకవర్గ కో ఆర్డినేటర్ సీడ్ మల్లికార్జుననాయుడు, బీజేపీ నాయకులు యల్లపల్లె ప్రశాంత్, బర్నేపల్లె రవికుమార్, అజ్మతుల్లాఖాన్, డీవైఈవో లోకేశ్వరరెడ్డి, ఎంఈవో ప్రభాకర్‌రెడ్డి, తదితరులు సేతుకు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో విజయభారతి స్కూలు ప్రిన్సిపాల్ నిశ్చితసేతు, హరినాథ్ దేవర, సాయి తదితరులు పాల్గొన్నారు.



సేతును సన్మానిస్తున్న తంబళ్లపల్లె నియోజకవర్గ కో ఆర్డినేటర్ మల్లికార్జుననాయుడు, బీజేపీ నాయకులు రవికుమార్, ప్రశాంత్